Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 81 • సంచిక: 12 • 19-3-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
నందేమార్కెట్ దగ్గర, పొగతోట, నెల్లూరు, సెల్: 99083 22007

లేజర్ చికిత్స
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
Professor, Endodontics
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

# మంత్రివర్గ విస్తరణ ఖాయం!

● **స్వంత మనుషులను పెట్టుకోవాలనుకొంటే చాలా మార్పులుండవచ్చు.**



రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై వూహాగానాలు గాలి పటాల వలె ఎగురుతున్నాయి. ఏ ఇద్దరు రాజకీయవాదులు ఒకచోట చేరినా ఇప్పుడు చర్చిస్తున్న అంశం ఇది మాత్రమే. వైఎస్ మరణం నాటి నుంచి రాష్ట్రాన్ని అట్టుడికించిన ఉద్యమాలు, వివాదాలు, జగడాలు, నిత్య ఉద్రిక్తతలు ఇప్పుడు లేవు. జగన్ గోల సమసిపోయింది. తెలంగాణ ఉద్యమం పాలపొంగు వలె చల్లారిపోయింది. ప్రతిపక్షం తన స్వంత కారణాలతో ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తున్నది. అసలు ఒక రోజైనా సభ జరుగుతుందా, బడ్జెట్ ఆమోదం పొందుతుందా అన్న అనుమానంతో ప్రారంభమైన శాసనసభ సమావేశాలు నిరంతరాయంగా, ఎన్నడూలేనంత సాఫీగా, ప్రశాంతంగా జరిగిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో కూడా చాలా మార్పు. రోశయ్యను ముఖ్యమంత్రిగా గుర్తించం, గౌరవించమన్న ధిక్కార స్వరం వినిపించిన మంత్రులంతా పిల్లి కూనల వలె ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లే ప్రశ్నే లేదని భీష్మ ప్రతిజ్ఞలు చేసిన ఎమ్మెల్యేలు కాగితాలు చేతపట్టుకొని, సిఎం పేషీలో తచ్చాడుతున్నారు. ఢిల్లీ నేతలు సైతం ఆంధ్ర వ్యవహారాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొదట మొదట రోశయ్య సమర్థత మీద వారికున్న అనుమానాలు తొలగిపోయాయి. ఏమీ చేతకాని వాడివలె, ఏమీ చేయలేని వాడివలె కన్పించిన రోశయ్య ఇప్పుడు అన్ని సమస్యలను పరిష్కరించిన తెలివైన వాడిగా ఢిల్లీ పెద్దల ప్రశంసలు పొందుతున్నాడు. మంత్రివర్గ విస్తరణకు ఇంతకంటే మించిన తరుణం మరేమి వుంటుంది?

ఈ నెలాఖరుతో శాసనసభ సమావేశాలు ముగుస్తున్నాయి. పార్లమెంటుకు కూడా సెలవు ఇచ్చారు. ఏప్రెల్ 10తేది మళ్లీ లోక్‌సభ ప్రారంభమయ్యే వరకు సోనియాగాంధీకి ఆట విడుపు. అందువల్ల ఆ పది రోజులలో ఏదో ఒకరోజు రోశయ్య ఢిల్లీకి వెళ్లి, విస్తరణకు అనుమతి తీసుకొని వస్తాడని భావిస్తున్నారు.

అయితే ఇది ఏ రూపంలో వుంటుందన్నది చర్చ. కొత్తగా కొంత మందిని తీసుకొని సరి పెడతారా లేక తీసివేతలు కూడికలతో భారీ విస్తరణ చేస్తారా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తన ఐదున్నరేళ్ల పాలనలో మూడుసార్లు మంత్రివర్గ మార్పులు చేపట్టినా, ఒక్కసారి కూడా వున్న వారిని తీయలేదు. కొత్తవారిని చేర్చుకోవడం, శాఖల మార్పిడి జరపడంతో సరిపెట్టారు. ఇప్పుడు రోశయ్య కూడా అదేబాట అనుసరిస్తాడో, లేక మంత్రివర్గం మొత్తం మీద తన ముద్ర వేయడానికి తన స్వంత మనుషులను పెద్ద సంఖ్యలో రంగంలోకి తెస్తాడో వేచి చూడాలి.

ఆయన తీరు గమనిస్తే రెండింటిలో ఏది ఎంచుకొంటాడో చెప్పడం కష్టంగా వుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి, మార్చమని కోరారు ఇటీవల. అయితే అందుకు రోశయ్య ఒప్పుకోలేదు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఒక లెక్క ప్రకారం, ఏ జిల్లాకు ఎవరు తగిన వాడో అన్న అంచనా ప్రకారం ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం జరిపాడు. కాబట్టి ఆయన చేసిన ఏర్పాటులో నేను వేలు పెట్టను అన్నాడు రోశయ్య. ఆయన ఆ మాట మీదే నిలబడితే మంత్రివర్గంలో కూడా పెద్దగా మార్పులు వుండక పోవచ్చు.

అయితే అదే సమయంలో ముఖ్యమంత్రి నామినేటెడ్ పదవుల నియామకంలో తన స్వంత మనుషులకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నాడు. ఇప్పటివరకు ఆయన నలుగురికి పదవీ బహుమానాలు ఇస్తే, వారిలో ముగ్గురు తన స్వంత కులానికి చెందినవారు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ తన స్వంత మనిషి. నిజానికి ప్రెస్ అకాడమీ గౌరవ ప్రతిపత్తులు కల్గిన సంస్థ. సంపాదకుల స్థాయిలో సుదీర్ఘకాలం పని చేసి, పాత్రికేయులుగా తలలు పండిన వారిని ఆ పదవిలో నియమిస్తూ వుంటారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మాత్రం, కెవిపి.రామచంద్రరావు సలహా

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్




ఇప్పటికైనా మా పెన్షన్ మంజూరు అయ్యిందేమో చూడు బాబు!

# జగన్‌కు కేంద్ర మంత్రిత్వం?

వైఎస్ మరణం నాటి నుంచి జగన్ పేరు చెప్తే ముఖం చిట్లిస్తుండిన ఢిల్లీ పెద్దల మనసు ఇన్నాళ్లకు కరిగినట్లుంది. ముఖ్యమంత్రి పదవి కోసం జగన్ పడిన తాపత్రయం, అందుకు ఆయన చూపిన తొందరపాటు, అందుకోసం చేసిన దుందుడుకు పనులు అధిష్టాన దేవతలకు చిరాకు పుట్టించాయి. దానితో వారు జగన్‌ను ఆమడ దూరంలో పెట్టారు. వీలు దొరికినప్పుడల్లా చురకలు అంటించారు. దానితో జగన్‌లో వైరాగ్యం పుట్టింది. ఎంత చాకిరీ చేసినా కాంగ్రెస్‌లో తనకిక భవిష్యత్తు వుండదన్న నిర్వేదంతో ఒక దశలో స్వంత పార్టీ పెట్టాలన్న ఆలోచన కూడా చేశాడు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత మే నెల నుంచి రాష్ట్ర పర్యటన జరిపి, తన తండ్రి అనుచరులు, అభిమానులను కూడేసి, స్వంత పార్టీ ఏర్పాటుకు ప్రాథమిక సన్నాహాలు చేయాలనే ప్రణాళికలో వున్నాడు జగన్. రాష్ట్ర స్థాయిలో కూడా ముఖ్యమంత్రి రోశయ్య తనను లెక్క చేయడం లేదన్న కోపం జగన్‌లో పుష్కలంగా వుంది. తన వద్దకు మంత్రులు వచ్చిపోవడాన్ని కూడా ముఖ్యమంత్రి సహించలేక పోతున్నాడని, తనకు ఆత్మీయులైన గాలి జనార్ధనరెడ్డి, గ్రానైట్ రాఘవరెడ్డి వంటి పారిశ్రామికవేత్తలను, శ్రీలక్ష్మి వంటి అధికారులను వేధిస్తున్నాడని ఆక్రోశం చెందుతున్నాడు జగన్.

అయితే ఇప్పుడు ఢిల్లీ పెద్దల ఆలోచనలో మార్పు వచ్చిందని తెలుస్తున్నది. పార్లమెంటు సమావేశాల తర్వాత జరపబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో జగన్‌కు స్థానం కల్పిస్తారని రాజధాని వర్తమానం. ఏదో ఒక శాఖలో ఆయన్ను సహాయమంత్రిగా తీసుకొంటారని చెప్తున్నారు. అయితే ఈ ప్రతిపాదన, వైఎస్ మరణించిన తొలిదినాల్లోనే వచ్చింది.

కొరవ 14వ పేజీలో

బలమైన, ఆరోగ్యకరమైన దంతాలకు
ఒకే ఒక్క చిరునామా! "స్మైల్"
పళ్లమధ్య సందులు, ఎత్తుపళ్లు, వంకరపళ్లను
స్మైల్ డిజైనింగ్ ద్వారా ఒక్కరోజులో సరిచేయవచ్చును.
ప్రభుత్వోద్యోగులకు అరుదైన అవకాశం.
నెలసరి వాయిదాలలో వైద్యఖర్చులను
చెల్లించే సదుపాయం.
స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్
ఫోన్: 0861-2344693, 92464 34447
నెల్లూరులో ప్రప్రథమంగా ISO 9001-2000 గుర్తింపు పొందిన డెంటల్ హాస్పిటల్



స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపిక బహుకరిస్తున్న వెంకయ్యనాయుడు.

## స్వర్ణభారత్ సేవలు ఘనం

వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్టులో ఏర్పాటుచేసిన ఉగాది వేడుకలకు శాసనసభ స్పీకర్ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్ట్ నిర్వాహకులు, బిజెపి సీనియర్ నేత ఎం.వెంకయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం ఎంతో హృద్యంగా సాగింది. ట్రస్టు ఆవరణమంతా కలియ తిరిగిన స్పీకర్ అక్కడ వివిధ రంగాల్లో విద్యార్థులకు, గ్రామీణులకు స్వయం ఉపాధి పథకాలపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు రాజకీయనేతలన్నా, స్వచ్ఛంద సంస్థలన్నా నాకు పెద్దగా నమ్మకముండేది కాదు. స్వర్ణభారత్ ట్రస్టు చూసిన తర్వాత, అది చేపడుతున్న కార్యకలాపాలను గమనించిన తర్వాత నా ఉద్దేశ్యం మార్చుకొంటున్నానని ప్రకటించారు. ప్రణాళిక ఉన్న వ్యక్తి వెంకయ్య నాయుడని, ఆయన వ్యక్తి కాదు సంస్థ అని ప్రశంసించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విదేశీ సంస్కృతిపై మక్కువతో దేశ సంస్కృతి సాంప్రదాయాలను యువత విస్మరిస్తున్నదని ఆవేదన చెందారు. స్పీకర్ పదవి ఎంతో గౌరవ ప్రదమైనదని, ప్రజలకు చక్కని సందేశం ఇవ్వవచ్చన్నారు. పత్రికలపైనా విమర్శలు గుప్పించారు. పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురించడం, అనవసర విషయాలకు అధిక ప్రాధాన్యత నివ్వడం సబబు కాదన్నారు. కలెక్టర్ రాంగోపాల్ మాట్లాడుతూ దేశ సంస్కృతి సాంప్రదాయాలకు వెంకయ్యనాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని కొనియాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకయ్య చేస్తున్న కృషిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఉగాది పర్వదినం ప్రాశస్త్యాన్ని వివరించిన తీరు ఆకట్టుకొంది. యాంకర్ ఝాన్సీ చక్కని తెలుగులో ప్రసంగించిన తీరు అలరించింది.

## పి.జి.పరీక్షలకు కొత్త విధానం

విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకొని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నూతన పరీక్షా విధానాన్ని అమలు చేయనున్నారు. ఇంతవరకు పిజి ఎంట్రన్స్ టెస్టుకు హాజరయ్యే విద్యార్థులు ఆయా యూనివర్శిటీలు నిర్వహించే వేరువేరు పరీక్షలకు హాజరు కావాల్సి వచ్చేది. ఈ పద్ధతికి స్వస్తి చెబుతూ కామన్ ఎంట్రన్స్‌ను ప్రవేశపెట్టేందుకు అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. దీని ప్రకారం రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ జిల్లాల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ద్రవిడియన్, శ్రీ పద్మావతి, యోగి వేమన, విక్రమ సింహపురి, రాయలసీమ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు విద్యార్థులు కామన్ ఎంట్రన్స్ టెస్టుకు హాజరైతే సరిపోతుంది. గతంలో ఆయా విశ్వవిద్యాలయాలు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలంటే ప్రతి యూనివర్శిటీకి దరఖాస్తు ఫీజు, ఆయా పరీక్షలకు హాజరయ్యేందుకు రాకపోకలకు ఎంతో వ్యయం అయ్యేది. ప్రస్తుతం తీసుకొన్న నిర్ణయంతో ఒకే పరీక్షతో పై విశ్వవిద్యాలయాల్లో సీటు పొందే వీలుంటుంది. ఇటీవల తిరుపతిలో జరిగిన వైస్ ఛాన్సలర్ల సదస్సులో ఈ మేరకు నిర్ణయించారు. 2010 అడ్మిషన్లకు మొదటగా శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనుంది. అనంతరం ఒక్కో ఏడాది ఒక్కో యూనివర్శిటీ ఈ పరీక్షలు నిర్వహించే విధంగా నిర్ణయించారు.

## ఆతిథ్యాలలోనూ వేరు కుంపట్లు!



ఇబ్బందిపడ్డ స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డి.

శాసనసభ స్పీకర్ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నగరానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్‌లోని గ్రూపులు వేరు వేరుగా ఆయనకు ఆతిథ్యం ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకొంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి స్పీకర్‌ను బార్ అసోసియేషన్, విఆర్ కళాశాలల్లో జరిగిన కార్యక్రమాలకు తీసుకొని వెళ్లి సన్మానించి ఆతిథ్యం ఇచ్చారు. ఆనం వారితో విబేధించి వేరు కుంపటి పెట్టుకొన్న రాజీవ్‌భవన్ నేతలు

### స్పీకర్ పర్యటనలో పదనిసలు

ప్రత్యేకంగా స్పీకర్‌ను కలసి గజమాలతో సత్కరించి నగరంలో రాజీవ్ భవన్ చేపడుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలను వివరించారు. సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన గృహానికి స్పీకర్ కిరణ్ కుమార్‌రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆదాల ఇంట్లో జరిగిన విందుకు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజీవ్‌భవన్ నేతలు హాజరయ్యారు. నగరానికి విచ్చేసిన శాసన సభాపతి కిరణ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్‌లోని రెండు గ్రూపులు వేరు వేరుగా కార్యక్రమాలకు ఆహ్వానించి ఆతిథ్యమివ్వడం చర్చనీయాంశమైంది.



పోలీసులు పట్టుకొన్న దొంగనోట్లు.

## బ్యాంకుల్లో నకిలీ నోట్లు

### లబోదిబోమంటున్న జనం

జిల్లాలో దొంగనోట్ల చలామణి అధికంగా వుంది. రోజూ ఏదో ఒక ప్రాంతంలో, వ్యాపారసంస్థల్లో దొంగనోట్లు బయటపడుతూనే వున్నాయి. బ్యాంకుల్లో సైతం నకిలీ నోట్లు అధికంగా బయట పడుతుండడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ట్రంకురోడ్డులో గల హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ఒకే రోజు ఆరు వేల రూపాయల విలువైన దొంగనోట్లు బయటపడడం సంచలనం కల్గించింది. నాలుగు వెయ్యి రూపాయల నోట్లు, నాలుగు 500 రూపాయల నోట్లు నకిలీవి రావడంతో బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ బ్యాంకు ఎటిఎం సెంటర్‌లో ఖాతాదారులు నగదు డ్రా చేయగా నకిలీనోట్లు రావడం, బ్యాంకు సిబ్బందిని దీనిపై సదరు ఖాతాదారుడు ప్రశ్నించడంతో గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఇది పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు వరకు పోయింది. ఇప్పుడు అదే బ్యాంకులో ఒకేసారి ఆరు వేల రూపాయల విలువైన నకిలీ నోట్లు బయటపడడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో దొంగనోట్లు బయటపడ్డాయని పోలీసులకు ఫిర్యాదుచేసినా తగిన విధంగా స్పందించకపోవడంతో నగదు డ్రా చేయాలంటేనే హడలి పోవాల్సి వస్తోందని కస్టమర్లు వాపోతున్నారు. ఇటీవల నగర పోలీసులు నకిలీ నోట్లను చలామణీచేసే ముఠాను అరెస్టు చేసినా దొంగనోట్లు విస్తృతంగా చలామణీలో వున్నాయని తేటతెల్లం అవుతోంది.



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రమేష్‌రెడ్డి.

## తెలుగుదేశంలో భగ్గుమన్న విభేదాలు!

నగర తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. ఆదివారం రాష్ట్ర పరిశీలకులు శ్రీనాధ్ రెడ్డి, నాగేశ్వరరావులు సెమినారు నిర్వహించిన సందర్భంగా ఇవి బట్టబయలయ్యాయి. నగర తెలుగుదేశం విభాగంలో గత కొంత కాలంగా రమేష్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల మేయర్ భానుశ్రీ ఇంటిపై అవినీతి నిరోధక శాఖాధికారులు దాడిచేసిన అనంతరం భానుశ్రీ రాజీనామా చేయాలని కోరుతూ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కిలారి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తానొక్కడే నిర్వహిస్తానని రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలను రావద్దని చెప్పారట. దీనిని మనసులో వుంచుకొన్న రమేష్‌రెడ్డి వర్గం 14వ తేది జరిగిన సమావేశంలో ఒక్కసారిగా తమ బాధను వ్యక్తం చేశారు. రమేష్‌రెడ్డి తన ప్రసంగంలో నేను మంత్రిగా, ఎమ్మెల్యేగా పార్టీ అభివృద్ధికి కృషిచేశానని, గత కొన్ని సంవత్సరాలుగా నగరంలో పార్టీ నాయకత్వంలో ఏకాభిప్రాయం లేకుండా పోయిందని చోటా నేతలు పుట్టగొడుగుల్లా వచ్చారని విమర్శించారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి, ధర్నాలు చేసినంత మాత్రాన నాయకులు కాలేరని పరోక్షంగా కిలారిని ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొనింది. రమేష్‌రెడ్డి మాటలకు కోపం కట్టలు తెంచుకొన్న కిలారి వెంకటస్వామి నాయుడు ఏం మాట్లాడుతున్నావు అంటూ స్టేజిపైకి దూసుకపోవడంతో తోపులాట జరిగింది. ఈ దశలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జోక్యం చేసుకొని తమకు ఎన్నో అవమానాలు జరుగుతున్నాయని, కార్యక్రమాలకు రావద్దని చెప్తున్నారని కానీ బాలకృష్ణకు ఇచ్చిన మాటకోసం పార్టీ ఉన్నతికి కృషి చేస్తున్నట్లు కన్నీళ్ల పర్యంతం అయ్యారు. కార్యకర్తల మధ్య ఉద్రిక్తత నెలకొనడంతో పార్టీ పరిశీలకులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువర్గాల మధ్య కా[illegible] కుదర్చడంతో సమావేశంలో గందరగోళానికి తెరపడింది.

## ఒకే వీధిలో ఐదు సెల్‌ఫోన్ టవర్లు



నెల్లూరు కావేరినగర్ నాల్గవవీధిలో ఐదవ సెల్‌టవర్ ఏర్పాటుకు పనులు జరుగుతున్న దృశ్యం.

నెల్లూరు నగర శివారులోని కావేరినగర్ నాల్గవ వీధిలో ఐదవ సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ వీధిలో టాటా, ఎయిర్‌టెల్, ఎయిర్‌సెల్, ఐడియా కంపెనీల సెల్ టవర్స్ వున్నాయి. ఇవి చాలవన్నట్లు టాటా కంపెనీ ఈ వీధిలోనే మరో సెల్ టవర్ నిర్మించడానికి సన్నాహాలు మొదలు పెట్టింది. సెల్‌టవర్స్ వల్ల ఈ ప్రాంతీయులు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆదాయమే పరమావధిగా కొత్తూరు పంచాయితీ సెల్‌ఫోన్ టవర్లకు అనుమతులివ్వడంపై కావేరినగర్ వాసులు జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. తమకు కలెక్టర్ న్యాయం చేస్తారన్న విశ్వాసాన్ని కావేరినగర్ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా బిల్లు ఆమోదంతో సరికొత్త శకం ఆరంభం!

**ఆకాశంలో సగంగా వున్న మహిళలకు రాజ్యాధికారంలో సమభాగం పంచాలన్న వుద్దేశ్యంతో తయారుచేసిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు 14ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాజ్యసభ ఆమోదం లభించడం ముదావహం.**



చారిత్రాత్మక బిల్లును ఆమోదించనున్న భారత పార్లమెంట్.

భారత రాజకీయ చరిత్రలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. ఆకాశంలో సగంగా వున్న మహిళలకు రాజ్యాధికారంలో సమభాగం పంచాలన్న నవచరిత్రకు పునాది ఏర్పడింది. 14 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మహిళా బిల్లుకు పార్లమెంటు ఎగువ సభలో ఆమోదం లభించింది. యుపిఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ధృడసంకల్పం నవీన శకానికి నాంది పలికింది. తరతరాల అసమానతలను అధిగమిస్తూ భారత మహిళ ఒక అడుగు ముందుకు వేసింది. ఎన్నో అవాంతరాలు, మరెన్నో ఆటంకాల నడుమ ఎట్టకేలకు మార్చి 9వ తేదీన రాజ్యసభలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఒక అంకం పూర్తయ్యింది. ఇంతవరకు స్థానిక సంస్థల ఎన్నికలలోనే మహిళలకు రిజర్వేషన్ అమలవుతూ వస్తుండగా ఇప్పుడు మహిళా బిల్లు ద్వారా చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అవకాశం మహిళలకు లభించనుంది. ఎన్నో ఏళ్లుగా మహిళలు జరుపుతున్న పోరాటానికి ఇది తొలి విజయం. లోక్‌సభలో ఆమోదం పొందడమే ఇక మిగిలి వుంది.

## భారతనారికి అరుదైన గౌరవం

అంతర్జాతీయ మహిళా శతవార్షిక దినోత్సవమైన మార్చి 8నాడే భారతనారికి గౌరవం దక్కాల్సి వున్నా కొందరు బిల్లుకు వ్యతిరేకంగా గందరగోళం సృష్టించడంతో ఒక్కరోజు ఆలస్యమైనా ఎట్టకేలకు బిల్లుకు ఆమోద ముద్ర పడింది. పద్నాలుగేళ్లుగా మూలనపడివున్న మహిళాబిల్లు ఒక్కో మెట్టు దాటడానికి ఎన్నో అడ్డంకులు. చివరకు సభలో గందరగోళం సృష్టిస్తున్న సభ్యులపై బహిష్కరణ వేటు వేసి మార్షల్స్ సహాయంతో వారిని బైటకు పంపితేకాని బిల్లుపై చర్చకు ఆ తర్వాత ఓటింగ్‌కు వీలు పడలేదు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లు రెండురోజులపాటు కొనసాగిన నాటకీయ పరిణామాల నడుమ మంగళవారం సాయంత్రం జరిగిన ఓటింగ్‌లో భారీ మెజారిటీతో ఆమోదం పొందింది. ఈ బిల్లు చట్టంగా రూపొందడానికి లోక్‌సభలోనూ ఆమోదం పొందినట్లయితే లోక్‌సభలోని 543 సీట్లలో 181 సీట్లు, 28 రాష్ట్రాలలోని 4,109 శాసనసభ సీట్లలో 1370 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి.

## 14ఏళ్ల అరణ్యవాసం

మహిళా రిజర్వేషన్ బిల్లుకు అక్షరాలా పద్నాలుగేళ్ల అరణ్యవాసం. సభ ముందుకు రాబోయిన ప్రతిసారి తిరస్కృతిని, అవమానాన్ని మూటగట్టుకొన్న చరిత్ర మహిళా బిల్లుది. మొదటిసారి 1996లో, ఆ తర్వాత 1998, 1999, 2008లో ఈ బిల్లు పార్లమెంటులోకి అడుగుపెట్టినప్పుడు సరిగా ఇవే గందరగోళాలు, భీకర సన్నివేశాలే. జనాభాలో 50శాతం వున్న మహిళలకు చట్టసభలలో మూడోవంతు స్థానాలను పంచుకొనేందుకు ఇష్టపడని మగవాడి సంకుచితతత్వాన్ని నగ్నంగా బయటపెట్టాయి. నిజానికి పార్లమెంటులో మహిళా బిల్లుకు కాంగ్రెస్, బిజెపి, వామపక్షాల మద్దతు ఉన్నప్పటికీ బిల్లుకు ఆమోదం లభించకపోవడం విచిత్రం. సమాజ్‌వాదీ పార్టీ ములాయంసింగ్ యాదవ్, రాష్ట్రీయ జనతాదళ్‌కు చెందిన లాలూప్రసాద్ యాదవ్, జనతాదళ్(యు) శరద్‌యాదవ్‌లు ముగ్గురే దీనిని వ్యతిరేకిస్తున్నారు. 2009 సంవత్సరం జూన్ 5తేదీన నిండు సభలో శరద్‌యాదవ్ ఈ బిల్లు ఆమోదం పొందితే విషం త్రాగి చస్తానని బెదిరించాడు. ఈ ముగ్గురు యాదవుల త్రయం తాము బిల్లుకు పూర్తి వ్యతిరేకం కాదని, ఇందులో బిసి, మైనార్టీ, దళిత మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని పట్టుబడుతున్నాయి. వారి డిమాండ్‌లోనూ కొంత న్యాయముందనే చెప్పాలి. అయితే మహిళలను కులమతాలకు అతీతంగా చూడాల్సిన అవసరం వుందన్నది అధిక సంఖ్యాకుల అభిప్రాయం. అదీగాక శతాబ్దాలుగా అణగారిన మహిళలకు ఒక సామాజిక, రాజకీయ న్యాయానికి ఉద్దేశించిన చర్చకు 14 ఏళ్లుగా మోకాలడ్డడం ఏ రకంగానూ న్యాయం కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## సాహసంతో విజయం

పెద్దల సభయైన రాజ్యసభలోనూ ఎంతో కృషి, మరెంతో సాహసం చేస్తే తప్ప విజయం దక్కలేదన్న సంగతిని గుర్తుంచుకోవాలి. సోనియాగాంధీ చొరవ, తెగువ ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాయి. గతంలో జరిగిన సన్నివేశాలే ఇప్పుడూ జరిగాయి. 1999లో అప్పటి న్యాయశాఖ మంత్రిగా వుండిన రాంజెఠ్మలానీ బిల్లును ప్రవేశపెట్టపోగా ఇతర సభ్యులు నిరోధించారు. 2008లో నాటి న్యాయశాఖ మంత్రి హెచ్‌ఆర్ భరద్వాజ్ ప్రవేశపెట్టినపుడు సభ్యుల తమ భుజబలం ప్రదర్శించారు. ఇప్పుడూ అదే జరిగింది. రాజ్యసభ చైర్మన్ హమీద్ అన్సారి బిల్లును ప్రవేశపెట్టే సందర్భంలోనూ దీనిని వ్యతిరేకించే సభ్యులు గందరగోళం సృష్టించారు. ఇక లోక్‌సభలోనూ ఆమోదం పొందినట్లయితే భారతీయ మహిళ తన చరిత్రను తిరగ రాసే క్రమంలో ఇదొక చిరస్మరణీయ విజయంగా మిగిలిపోనుంది.

రాష్ట్ర శాసనసభలోనూ మహిళలకు పట్టాభిషేకం జరగబోతోంది. మహిళాబిల్లు చట్టరూపం దాలిస్తే రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాలలో 98 స్థానాలు మహిళల వశం అవుతాయి. వీటిలో ఎస్సీ మహిళలకు 18 స్థానాలు, ఎస్టీ మహిళలకు 6 స్థానాలు పోను మిగతా 74 స్థానాలు జనరల్ కేటగిరిలో వుంటాయి. జిల్లాకు సంబంధించి మూడు అసెంబ్లీ స్థానాలు మహిళలకు లభించే అవకాశం వుంది. స్థానిక సంస్థలు అయిన పురపాలక సంఘాలు, జడ్పీటిసి, ఎంపిటిసి, ఎంపిపి, సర్పంచ్‌ల పదవుల్లోనూ భారీగా అవకాశాలు లభించనున్నాయి. ఈ మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందడంపై వివిధ వర్గాల మహిళలు వెల్లడించిన అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి.



### కల నెరవేరింది

మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారు రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. సోనియాగాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకొన్నారు. మహిళాలోకానికి వరాన్నిచ్చారు. చాలా సంతోషం కల్గించే అంశం. మహిళల కల ఇన్నాళ్ళకు నెరవేరింది. రాజ్యసభలో మెజార్టీ సభ్యులు ఈ బిల్లుకు ఆమోదం తెలపడం హర్షదాయకం.

***పందిళ్లపల్లి అరుణమ్మ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు.***



### చారిత్రాత్మకం

మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు రాజ్యసభ ఆమోదం పొందడం మహిళలకు లభించిన గౌరవం. ఈ బిల్లు వల్ల మరింతగా మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది. గతంలో దివంగత ఎన్‌టి రామారావు మహిళలకు ఆస్తిలో వాటా కల్పించి చరిత్ర సృష్టించారు. ఇప్పుడు మరోసారి మహిళలకు అర్హత అవకాశం కల్పిస్తూ యుపిఏ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొంది.

***నువ్వుల మంజుల, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు.***



### మహాభాగ్యం

మహిళలకు అన్ని అర్హతలున్నా అవకాశాలు లేక చట్టసభల్లో రాణించలేకపోతున్నారు. మహిళాబిల్లు అమలులోకి వస్తే అంతకు మించిన భాగ్యం మరొకటి లేదు. 33 శాతం రిజర్వేషన్ ద్వారా మహిళలు అన్ని రంగాల్లో సమానత్వాన్ని సాధించే అవకాశం లభిస్తుంది.

***రాజ్యలక్ష్మి***



### మహిళల సత్తా తెలుస్తుంది!

మహిళా బిల్లు ప్రవేశపెట్టడం దానికి రాజ్యసభలో ఆమోదముద్ర లభించడం వలన మహిళలకు రాజకీయ ప్రవేశం సులువు అవుతుంది. స్థానిక సంస్థలలో ఇప్పటికే పలువురు మహిళలు రాణిస్తున్నారు. ఈ బిల్లు వలన చట్టసభల్లో మహిళల సత్తా దేశానికి తెలుస్తుంది.

***వినీష***



అమరజీవి పొట్టిశ్రీరాములు 110వ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు.



నెల్లూరు నగరంలోని మహిళలకు చెత్త బుట్టలు పంచుతున్న జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ సలాం దస్తగిరి.



నెల్లూరు పినాకిని చారిటీస్ ఆధ్వర్యంలో చదరంగ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఆచార్య ఆదిత్య. ప్రక్కన అమరావతి కృష్ణారెడ్డి, ముక్కు రాధాకృష్ణ తదితరులు.



నెల్లూరు హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది అజయ్‌కుమార్. వేదికపై డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తదితరులు.

# మనుబోలులో మురుగు!

● పట్టని పంచాయితీ

మండల కేంద్రమైన మనుబోలులో ఎక్కడ చూసినా మురుగునీరే దర్శనమిస్తుంది. కొన్నిచోట్ల డ్రైనేజి కాలువలు లేకపోవడం, వున్న కాలువల్లో పూడిక తీయని కారణంగా నీరు పారే అవకాశం లేక రోడ్లపై పొంగుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మనుబోలు నుంచి కోదండరామపురం బైపాస్‌రోడ్డు వరకు వున్న రెండు కిలో మీటర్ల ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి కాలువలు లేవు. దీంతో రోడ్డు ప్రక్కనే మురుగునీరు ప్రవహిస్తోంది. తూర్పువీధి, శివాలయం ప్రాంతాల్లో ఇళ్ల మధ్యనే పెద్ద పెద్ద గుంటలు వుండడంతో వాటిలో మురుగునీరు చేరి దుర్గంధభరితంగా పరిసరాలు తయారయ్యాయి. వీటికి దోమలు తోడవడంతో ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ఇంతగా అవస్థలు పడుతుంటే పంచాయితీ పాలకులుగాని, అధికారులుగాని పట్టించుకోకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించింది.

# జీవాలకు బొబ్బర వ్యాధి!

ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో జీవాలకు బొబ్బరవ్యాధి సోకడంతో వందల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కావలి డివిజన్ పరిధిలో మేకలు 1,82,145, గొర్రెలు 3,22,600, కోళ్లు 6,32,045 ఉన్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తున్నది. ఇటీవల ఈ ప్రాంతంలోని గొర్రెలు, మేకలకు బొబ్బరవ్యాధి సోకి చనిపోతుండడంతో పెంపకందార్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉదయగిరి ప్రాంతంలోని గుడినరవ, తిరుమలాపురం, దుంపవారిపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి తదితర ప్రాంతాల్లో వందలాది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ వ్యాధిసోకిన జీవాలు నీరసించడం, మేత మేయకపోవడం, కళ్లుఎర్రబడి నీరు కారడం, శరీరమంతా పుండ్లు ఏర్పడడం లాంటివి ఈ వ్యాధి లక్షణాలని పశువైద్యులు చెప్తున్నారు. ఈ లక్షణాలు కన్పడిన వెంటనే పశువైద్యుడిని సంప్రదించినట్లయితే నివారణ చర్యలు చేపట్టవచ్చుంటున్నారు.

**ఉదయగిరిలో తలవాల్చుతున్న మేకలు, గొర్రెలు**

# తగ్గిపోతున్న నిమ్మసాగు!

**గూడూరు డివిజన్‌లో 2వేల ఎకరాలకే పరిమితమైన సాగు**

జాతీయస్థాయిలో పేరొందిన గూడూరు డివిజన్‌లో నిమ్మతోటల సాగు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతంలో 10వేల ఎకరాల్లో సాగవుతున్న నిమ్మపంట నేడు 2వేల ఎకరాలకు పరిమితం కావడం పరిస్థితిని తెలియజేస్తున్నది. నిమ్మతోటల సాగుదారులకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందకపోవడం, నీటివనరులు అడుగంటడం, విద్యుత్‌సరఫరా సక్రమంగా వుండకపోవడం లాంటి కారణాల వల్ల నిమ్మకాయల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఒకనాడు గూడూరు, సైదాపురం, ఓజిలి, చిల్లకూరు, కోట, మనుబోలు, కలువాయి, పొదలకూరు మండలాల్లో నిమ్మతోటల సాగును విస్తారంగా చేపట్టేవారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ ప్రాంతరైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా దిగుబడి లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో కలకత్తా, పూణె, హర్యానా, బెంగుళూరు, చెన్నై, పాండిచ్చేరి ప్రాంతాలలో నాణ్యమైన గూడూరు నిమ్మకాయలకు ఎంతో డిమాండ్ వుండేది. అయితే వాతావరణ మార్పుల వలన తెగుళ్లు సోకడం, నీటి కొరత, విద్యుత్ కోతలు తదితర కారణాలతో నిమ్మతోటల సాగు తగ్గిపోయింది. ప్రభుత్వం గనుక ఇప్పటికైనా పట్టించుకోకపోతే నిమ్మతోటలు అంతర్ధానం కావడం ఖాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● అక్రమార్కుల చెరలో

# కనుపూరు హైస్కూల్ స్థలం!

**పట్టించుకొనేవారే లేరు**

వెంకటాచలం మండలంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జోరందుకొంది. ఖాళీస్థలం కన్పడితే చాలు ఆక్రమించేస్తున్నారు. చివరకు విద్యాలయాలను సైతం వదలడంలేదు. కనుపూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల నేడు ఆక్రమణ చెరలో చిక్కుకొంది. పాఠశాలకు క్రీడామైదానంగా వున్న స్థలంలో కొందరు గుడిసెలు వేసుకొన్నారు. బహిరంగంగా జరిగిన ఈ ఆక్రమణ విషయం తెలిసినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఆటస్థలం లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించడం ఒక తప్పయితే, కొందరు రెవెన్యూ అధికారులు వీటికి పొజిషన్ సర్టిఫికేట్‌లు ఇచ్చి వుండడం విస్మయం కల్గించే విషయం. ఇంతగా స్థలాలు కబ్జాకు గురౌతున్నా పట్టించుకొనే వారే లేకపోవడంతో ఆక్రమణలు అధికం అవుతున్నాయి.

# రైతులను నష్టపరుస్తున్న నకిలీలు

**మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువుల హవా**

నకిలీ విత్తనాలు, ఎరువులు రైతాంగాన్ని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. చేతికంది వచ్చే పంట కళ్లముందే దెబ్బతినిపోతుండడం అన్నదాతలను కలవరపెడుతోంది. పొదలకూరు మండలంలోని పలు గ్రామాల రైతులు నకిలీల కారణంగా ఆర్థికంగా చితికిపోయారు. ప్రస్తుత సీజన్‌లో 350 ఎకరాల్లో సాగుచేసిన వరిపంట పూర్తిగా ఎండిపోయింది. మండలంలోని దేగపూడి, కొనసాగలూరు గ్రామాలకు చెందిన రైతులు నెల్లూరులోని ప్రైవేట్ విత్తన కేంద్రాల నుంచి బిపిటి-5204 రకం వంగడాలను కొనుగోలు చేసి పంటసాగు చేశారు. సకాలంలో నాట్లు వేసినా పైరు ఎదుగుదలలో మార్పు రాకపోవడంతో అన్ని రకాల సస్యరక్షణ చర్యలు చేపట్టారు. దీని కోసం ఎకరాకి 15వేల రూపాయల వరకు వ్యయం చేసినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పైరు సరిగా పెరగక గిడసబారిపోవడం, ఎండిపోవడంతో అప్పులపాలైపోయామని రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. లక్షలాది రూపాయలు నేలపాలయ్యాయని, అధికారులు తమకు జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని కోరుకొంటున్నారు.



ప్రజారాజ్యం పార్టీలో చేరిన ఖాజామొహిద్దీన్‌ను సన్మానిస్తున్న నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి.

# ఉప్పురైతులకు కష్టకాలం!

## ● రేటు లేక లబోదిబో

అన్ని వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఉప్పు రైతులు మాత్రం ధరలేక ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కయ్యల్లో ఉప్పు నిల్వలు పేరుకొనిపోతున్నాయి. గతంలో మాదిరి ఉప్పుకు తగిన ధర లేకపోవడంతో రైతులు విలవిల్లాడిపోతున్నారు. జిల్లాలో ముత్తుకూరు, అల్లూరు తదితర మండలాల్లో దాదాపు 1800 ఎకరాల్లో రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. ముత్తుకూరుతో పోలిస్తే అల్లూరు మండలంలోనే ఎక్కువగా వుంది. కొందరు సొంత భూముల్లో, మరికొందరు ప్రభుత్వం మంజూరు చేసిన వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ పరిధిలోని సాల్ట్ డిపార్ట్‌మెంట్ తక్కువ లీజుతో పొలాలను రైతులకు అందజేసి వుంది. ఇక్కడ నుంచి కర్నాటక తదితర రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి అవుతోంది. గత సీజన్‌లో టన్ను 180 రూపాయల నుంచి 190 ధర పలికిన ఉప్పు ఇప్పుడు 50 రూపాయలకు మించి ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. మరోవైపు తమిళనాడు రాష్ట్రం నుంచి తక్కువ ధరలకే ఉప్పును దిగుమతి చేసుకొంటుండడంతో ఈ ప్రాంత రైతులకు భారంగా మారింది. ప్రస్తుతం వున్న రేట్లకు అమ్మకాలు సాగిస్తే నష్టపోవాల్సి వస్తోందని ఉప్పురైతులు వాపోతున్నారు.

● అల్లూరు సమ్మర్ స్టోరేజి ట్యాంకు

# ఎప్పటికి పూర్తయ్యేను?

అల్లూరు మండలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు నిర్మింప తలపెట్టిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురౌతున్నాయి. మండల పరిధిలోని 49 మజరా గ్రామాలకు ఈ ట్యాంకు నుంచి నీరు సరఫరా కావాల్సి వుంది. నిర్మాణం పూర్తికాకపోవడంతో దానికి అనుసంధానంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా మారుతున్నాయి. పనులను చేపట్టిన కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో వేరొకరికి పనులు అప్పగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వున్నప్పుడు 10కోట్లతో ట్యాంకు నిర్మించాలని తలచారు. తర్వాత అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి అవసరమైన నిధులను మంజూరు చేశారు. మొదటి విడతగా మంజూరైన నిధులతో స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాల వద్ద ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. చెరువు లోతట్టు ప్రాంతంలో స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రైతులు అనధికారికంగా సాగు చేసుకొంటుండడం, కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయలేకపోవడంతో పైపులు వృధాగా రోడ్డు ప్రక్కనే పడి వున్నాయి. వేసవి మొదలైన నేపథ్యంలో అధికారులు త్వరితగతిన ఈ నిర్మాణాలు చేపట్టి సింగపేట, వెలిచర్ల, అల్లూరు, ఇస్కపల్లి, తూర్పు గోగులపల్లి, పురిణి, ఇందుపూరు, పడమర గోగులపల్లి తదితర గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పించాల్సి వుంది.

**రెండు దశాబ్దాలుగా సాగుతున్న పనులు**

● మురికి కూపంగా

# జొన్నవాడ స్నాన ఘట్టం!

పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి స్నానఘట్టం అపవిత్రమవుతున్నది. ఆలయం ప్రక్కనే గల పెన్నానది వద్ద భక్తుల సౌకర్యార్థం దేవాదాయ అధికారులు స్నానఘట్టాన్ని ఏర్పాటు చేశారు. పలువురు భక్తులు ఇక్కడ స్నానాలు చేస్తుంటారు. అలాంటి ప్రదేశం నేడు మురికికూపంగా, బహిర్భూమిగా మారడంతో భక్తులు కలతచెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో స్నానఘట్టం రూపురేఖలు మారిపోయి దుర్గంధం వెదజల్లుతూ

## పట్టించుకోని పాలక వర్గం

అసహ్యకరంగా మారిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. గ్రామస్తులు ఈ ప్రదేశాన్ని బహిర్భూమిగా ఉపయోగించుకోవడం, ఆలయానికి సంబంధించిన కలుషిత నీరు స్నానఘట్టాల వద్ద పెన్నానదిలో కలుస్తుండడంతో భక్తుల బాధలు వర్ణనాతీతం. ఇంతగా ఆ ప్రాంతం మురికికూపంగా మారినా పాలకవర్గం ఆ వైపు దృష్టిసారించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# స్థానికులకు ఉద్యోగాలివ్వండి!

## పంటపాళెం, ఈపూరు పామాయిల్ ఫ్యాక్టరీల వద్ద ధర్నాలు!

ముత్తుకూరు మండలం పంటపాళెం, ఈపూరు సమీప ప్రాంతాల్లో నిర్మితమవుతున్న పామాయిల్ ఫ్యాక్టరీల వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఫ్యాక్టరీలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మత్స్యకారేతర ప్యాకేజీలను తక్షణం పంపిణీ చేయాలని కోరారు. మూడు డిమాండ్లతో రైతులు ఫ్యాక్టరీలను ముట్టడించడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. రోడ్డుపైనే బైఠాయించి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. తహశీల్దార్ ఉమాదేవి హాజరై ఆందోళనకారులను శాంతింపజేశారు. కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకొని పోతామని చెప్పారు. రైతులు చేపట్టిన ఆందోళనకు కృష్ణాపట్నం సహకార సంఘం అధ్యక్షుడు దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బలరామ కృష్ణారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు కోదండరామిరెడ్డి తదితరులు నాయకత్వం వహించారు.




# శ్రీ షిర్డిసాయిబాబా వారి శ్రీరామనవమి ఉత్సవములు

తేది 24-03-2010 బుధవారం నుంచి 26-03-2010 శుక్రవారం వరకు

ప్రతిరోజు ఉదయం 7-30 గంటల నుంచి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనగోరు భక్తులు మందిర గుమస్తా వద్ద 75/- రూపాయలు చెల్లించి పై పూజలలో పాల్గొని బాబా వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

గమనిక : పై దినములలో ప్రతిరోజు షిర్డి హారతులు జరుపబడును.

పై దినములలో ప్రతిరోజు సాయంత్రం 7-00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమములు కలవు.

కార్యవర్గము శ్రీ షిర్డి సాయిబాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు.
ఫోన్ : 2327771

## మంత్రివర్గంపై కసరత్తు



రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేయడానికి రోశయ్య కసరత్తు ప్రారంభించారు. రోశయ్య ముఖ్య మంత్రి అయిన దగ్గర నుంచే మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయని భావించడం, ఈలోగా ఏదో ఒక ఆటంకం యేర్పడటం జరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రోశయ్య లైన్ క్లియర్ అయింది. అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. అధిష్ఠానం అనుమతి లభించింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఏప్రిల్ మొదటివారంలో మంత్రివర్గంలో మార్పులు ఖాయం కావచ్చు. రోశయ్య కూడా మంత్రివర్గంపై మనసు పెడుతున్నాడు. ప్రస్తుత మంత్రివర్గంలో తనకు అనుకూలంగా, వ్యతిరేకంగా వున్న వాళ్ల జాబితాను సిద్ధం చేశాడు. వై.ఎస్ వీరవిధేయులకు ఈసారి మంత్రివర్గంలో చుక్కలు చూపించే అవకాశం వుందంటున్నారు. చూద్దాం! ఏం జరుగుతుందో అంటూ ఆశావహులంతా ఎదురు చూస్తున్నారు.

## ఎవరి పంచాంగం వారిది



రాజకీయ పార్టీలకు వారి సిద్ధాంతాలతోపాటు పంచాంగాలు కూడా వేరేగా వున్నాయా? ఉగాది పండుగ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జరిగిన పంచాంగ శ్రవణాల్ని చూస్తే నిజమే అనిపిస్తోంది. గాంధీభవన్‌లో జరిగిన పంచాంగ శ్రవణంలో ముఖ్యమంత్రి రోశయ్యకు, పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌కు ఈ యేడాది మహర్దశ ఉన్నట్లు తేలింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ఇందుకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు నాసిగా వుంటాయని వెల్లడైంది. పనిలో పనిగా ఈ యేడాది తెలుగు దేశంపార్టీకి ఉజ్వల భవిష్యత్తు కనిపిస్తోందని కూడా 'పసుపు' పంచాంగంలో తేలింది. ఇక ప్రజారాజ్యం పార్టీ కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో రాబోయే రోజుల్లో రాజకీయం అంతా చిరంజీవి చుట్టూ తిరుగబోతున్నట్లు తెలిసింది. బిజెపి పంచాంగంలో వచ్చే రోజులన్నీ కాషాయానికి అనుకూలంగా వున్నాయట. ఏదైతేనేం ఎవరి పంచాంగం వారిది! అన్నట్లుంది రాజకీయపార్టీల వైఖరి!

## ఇరకాటంలో ఆనం!




భానుశ్రీ ఇంటిపై ఎసిబి దాడుల వ్యవహారంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇరకాటంలో పడ్డారు. సొంత కార్పొరేషన్ మేయర్‌పై ఎసిబి దాడులు జరిగిన దృష్ట్యా ప్రభుత్వపరంగా ఏ చర్య తీసుకోబోతున్నారని విలేకరులు గుచ్చి గుచ్చి అడిగినప్పుడు ఆనం తడబడ్డారు. మొత్తం మీద తమాయించుకొని, మేయర్‌పై ప్రభుత్వానికి నివేదిక అందింది. దీనిపై విచారణ జరిపి త్వరలోనే చర్యతీసుకుంటామని మంత్రి సమాధానం చెప్పారు. ఎసిబి దాడుల్లో బయటపడిన ఆస్తుల వివరాల్ని వెల్లడించడానికి మంత్రి నిరాకరించాడు. అన్ని విషయాలు త్వరలోనే తెలుస్తాయి కదా! అంటూ దాట వేశాడు. మొత్తం మీద భానుశ్రీ వ్యవహారం మంత్రి పీఠానికి ఎసరు పెట్టేలా వుందని విలేకరులు గొణుక్కుంటూ వెళ్లారు! పాపం! ఆనం!!

## ఇల్లు పూర్తికానిదే కదలడట



వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఎఆర్ సుకుమార్ ఇప్పట్లో బదిలీ వద్దంటూ భీష్మించాడట. మార్కెటింగ్‌శాఖలో చేరి రెండేళ్లు కావడంతో ఆ మధ్య ఐటి శాఖకు బదిలీ చేశారు. అయితే తనకు ఇప్పట్లో బదిలీ వద్దంటూ ముఖ్యమంత్రి రోశయ్య కాళ్లా వేళ్లా పడ్డాడట. ఒకే సామాజికవర్గం కావడంతో ఆయన సరేనన్నాడు. దాంతో సుకుమార్ బదిలీ నిలిచిపోయింది. బదిలీ వద్దనడానికి కారణం ఏమైవుంటుందబ్బా అంటూ సాటి ఐఎఎస్‌లు ఆరా తీశారట. నగరంలోని జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో ఎనిమిది అంతస్తుల భవనం కడుతున్నాడట. ప్రస్తుతం ఆ భవన నిర్మాణానికి సదరు మార్కెటింగ్ ఇంజనీర్లు రాళ్లెత్తుతున్నారట. ఇల్లు పూర్తికానిదే బదిలీ అయితే కష్టమని సుకుమార్ భావిస్తున్నట్లు ఐఎఎస్‌ల ఎంక్వయిరీలో తేలింది.




గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ చేతుల మీదుగా
డాక్టరేట్ అందుకొంటున్న శ్రీ నేదురుమల్లి పద్మనాభరెడ్డి గారు

మీరెందరికో స్ఫూర్తి ప్రదాత...

స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి గారు చూపిన బాటలో
పయనిస్తూ... ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థలను దినదిన ప్రవర్ధమానంగా
అభివృద్ధి పరచి... ఎందరికో బతుకుబాట చూపారు మీరు...
జాతిపిత గాంధీజీ జీవితంపై అనురక్తితో 78ఏళ్ల వయస్సులోనూ
దక్షిణాఫ్రికా, సబర్మతి ఆశ్రమాలు సందర్శించి దండి సత్యాగ్రహంలో పాల్గొని
మహాత్ముని మరో కోణంలో జాతికి చూపించి
ఎందరికో స్ఫూర్తిప్రదాతగా నిలచిన

**శ్రీ నేదురుమల్లి పద్మనాభరెడ్డి గారు**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం 50వ స్నాతకోత్సవంలో
గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ చేతుల మీదుగా
డాక్టరేట్‌ను అందుకొన్న శుభసందర్భముగా
మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

స్టాఫ్ **NBKR** సైన్స్ & ఆర్ట్స్ కాలేజి
విద్యానగర్.

# సకల గుణాభిరాముని జన్మదినమే శ్రీరామనవమి!



శ్రీరామనవమి హిందువులకు ముఖ్యమైన పండుగ. శ్రీ మహావిష్ణువు ఎత్తిన పది అవతారాలలో శ్రీరామావతారం ఏడవది. కోసల దేశాధీశులైన దశరధునికి కౌసల్య గర్భమున చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రం నాల్గవ పాదమున కర్కాటకలగ్నంలో శ్రీరాముడు జన్మించాడు. నవమినాడే సీతాదేవితో వివాహమైందని, పదునాలుగు సంవత్సరాలు అరణ్యవాసం, రావణ సంహారానంతరం శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషక్తుడైంది నవమి నాడే అని రామాయణ కావ్యము తెలుపుచున్నది. అలాంటి చైత్రశుద్ధ నవమిని శ్రీరామజయంతిగా వేడుకగా జరుపుతారు దేశవ్యాప్తంగా. ఆంధ్ర దేశంలో శ్రీరామనవమి రోజున సీతారామ కళ్యాణం జరపడం అనాదిగా వస్తోంది. ఈ యేడాది శ్రీరామనవమి 24వ తేది వస్తుంది.

రావణుడు అనే రాక్షసుడు శివుని వద్ద వరాలు పొంది దేవతలను జయించి మునులను వేధిస్తుంటాడు. రావణునికి దేవగంధర్వ యక్ష రాక్షసుల వల్ల చావులేదు. దేవతల ప్రార్థనలు మన్నించి శ్రీమహావిష్ణువు రావణుడిని సంహరించేందుకు రాముడిగా నరరూపంలో జన్మించాడు. ఆది శేషుడు లక్ష్మణునిగా, శంఖ చక్రములు భరత, శత్రుఘ్నులుగా అవతరించారని, శ్రీ మహాలక్ష్మి సీతాదేవిగా జన్మించిందని పురాణాలు చెప్తున్నాయి.

దేశంలోని ప్రజలంతా సిరిసంపదలతో, సుఖసంతోషాలతో వుంటే అది రామరాజ్యం అని హిందువుల విశ్వాసం. మహాత్మాగాంధీ కూడా స్వాతంత్ర్యానంతరం భారత దేశం రామరాజ్యంగా విలసిల్లాలని భావించాడు. శ్రీరామ నవమి నాడు సూర్యభగవానునికి ప్రార్థన చేయడంతో ఉత్సవం ఆరంభమవుతుంది. శ్రీరాముడు జన్మించినట్లుగా చెప్పబడుతున్న సమయం మధ్యాహ్నం కావడం వల్ల ఆ సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పండుగనాడు కుటుంబ సభ్యులందరూ ప్రొద్దుటే లేచి తలంటి స్నానం చేసి శుభ్రమైన వస్త్రాలు ధరించి సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న అంజనేయ సమేత శ్రీరామచంద్రునికి పూజ చేస్తారు. నీటిలో బెల్లం, మిరియాలు, యాలకులు కలిపి పానకం, వడపప్పు తయారుచేసి నైవేద్యంగా పెడతారు. భద్రాచలంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కళ్యాణం వైభవంగా జరుపుతారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపడం సాంప్రదాయం. సీతారామ కళ్యాణం జరిపించినా లేక చూసినా సర్వ శుభాలు కల్గుతాయని పురాణ కథనం.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### సమస్యకు మూలం దొరికింది!



నెల్లూరు నగరంలో ట్రాఫిక్ చిక్కుముడి విప్పను కొత్త ఎస్పీ దామోదర్ రంగంలోకి దిగారు. ఎన్నోఏళ్లుగా జరపని ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో పేరుగాంచిన ప్రొఫెసర్ భానుమూర్తి, నగర ట్రాఫిక్‌పై మంచి అవగాహన వున్న ఎ.వి.కృష్ణారెడ్డి వంటి వారిని పిలిపించారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారంతా నగరంలో ట్రాఫిక్ సమస్యకు మొదటి హర్డిల్ ఇటీవల కట్టిన ఐలాండ్లు అని చెప్పారు. వీటిని రూరల్ ఎమ్మెల్యే సోదరుడు బినామి పేర్లతో కాంట్రాక్టర్ అవతారమెత్తి కట్టించి లక్షలు బొక్కిన విషయం పాపం ఎస్పీ గారికి తెలియదు కదా? ఈ ఐలాండ్లను పగల గొట్టించను ఆనం బ్రదర్స్ ఒప్పుకోరు. ఇక ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం భ్రమేనందామా...

### కురుగొండ్ల చీరల పంపిణీ



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శాసనసభలోని మహిళా ఎమ్మెల్యేలందరికీ వెంకటగిరి నేత చీరలు అందజేయడం చర్చనీయాంశమయ్యింది. అయితే ఈ అందజేత వెనుక ఓ మెలిక కూడా వుంది. ప్రపంచవ్యాప్తంగా తమ హస్తకళా నైపుణ్యంతో పేరుగాంచిన వెంకటగిరి చేనేత కార్మికులు పూటగడవక పస్తులుంటున్నారన్న విషయం సింబాలిక్‌గా శాసనసభ ద్వారా రాష్ట్రానికి తెలియజేయాలని రామకృష్ణ ఈ ఎత్తుగడ వేశారు. ఈ వ్యవహారంలో మహిళా ఎమ్మెల్యేల మద్దతు కోరనే ఈ చీరల పంపిణీ చేసి కురుగొండ్ల సభలో చర్చకు ముందే పెద్ద చర్చను లేవదీశారు.

### మస్తాన్ వలీకే కష్టాలు!



జిల్లాలో కులమతాల కతీతంగా ఆరాధించే మహిమాన్వితుడు కసుమూరు మస్తానయ్య. ఒకప్పుడు మస్తానయ్య దర్శనం చాలా సులభం. కాని తెలంగాణ నుంచి వచ్చి హుండీ పాడుకొన్న ముజావర్లు హుండీలో తాము నిర్దేశించిన మొత్తాలు వేస్తేగాని దర్గాలో 'ఫాతేహా' కూడా జరపడం లేదు. ఈ వారంలో జరిగిన ఆయన గంధమహోత్సవం రోజు ముజావర్లు, పీఠాధిపతులు తామంటే తాము గొప్పని 'సిజరా' చదువుకొంటూ మస్తానయ్య సమాధికి గంధం పూయను సైతం గంటల తరబడి ఆలస్యం చేశారు. ఆస్కార్ అవార్డు విజేత ఎఆర్ రెహ్మాన్ వంటి సెలబ్రిటీలతో సామాన్య ప్రజలు మస్తాన్‌వలీ సమాధికి పూసిన గంధం కోసం వేచి వుండక తప్పలేదు. మస్తాన్‌వలీ గంధ మహోత్సవం రోజు ఆయనకే శాంతి లేకుండా చేసిన వ్యక్తులను ఏమనాలో భక్తకోటికి అర్థం కావడం లేదు.

### చర్మంతో చెప్పులు కుట్టించినా...



రుణానుబంధీయులు చర్మంతో చెప్పులు కుట్టించినా దాన్ని తీర్చుకోలేమంటుంటారు. నెల్లూరు కార్పొరేషన్‌లో సీనియర్ కార్పొరేటర్ సయ్యద్ సందానిబాష ఒకప్పుడు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డిని తిట్టి బాగా నష్టపోయారు. ప్రస్తుతం ఆయన పంచన వున్న సందానిని రాజీవ్‌భవన్ నిర్వాహకులను తిట్టే పనికి నియోగిస్తున్నాడు వివేకానందరెడ్డి. ఆయన 'భవన్'కు బ్యాకు బోనులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలతోపాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను నోటికొచ్చినట్లు తిట్టిపోస్తున్నారు. ఈ వ్యవహారాలకై ఏర్పాటుచేస్తున్న విలేకరుల సమావేశంలో ఓ పాత్రికేయుడు సందానిని మీరు కూడా గతంలో వివేకాను తిట్టిన బాపతేగా అని ప్రశ్నించగా సందాని వీరావేశంతో ఆయనకు నా చర్మంతో చెప్పులు కుట్టించినా రుణం తీర్చుకోలేనని చెప్పడం ప్రక్కనున్నవారికి నవ్వు తెప్పించింది.

### భలే అయ్యవార్లు



గతంలో బతకలేనివాళ్లు బడిపంతుళ్లు అనేవారు. ఇప్పుడేమో బతకనేర్చినవాళ్లు బడిపంతుళ్లంటున్నారు. నెల్లూరు బడిపంతుళ్లు మాత్రం మహాముదుర్లు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వందమందికిపైగా బడి పంతుళ్లు విధులకు డుమ్మాకొట్టి ఇతర వ్యాపారాలు చేసుకొంటున్నారు. ప్రాథమిక విద్యాశాఖ కమిషనర్ ఇటువంటి బడిపంతుళ్ల వివరాలు సేకరించి పంపమని ఆదేశాలివ్వడంతో ఈ చిట్టాను అతి కష్టపడి డిఇఓ కార్యాలయం రూపొందించింది. కాని వీరిపై చర్యలకు వుపక్రమించే ధైర్యం డిఇఓ కార్యాలయానికి వుందా అనేదే అందరికీ కలుగుతున్న సందేహం!

అవినీతి అక్రమాలకు పేరెన్నికగన్న నెల్లూరు కార్పొరేషన్‌లో కాల్వల పూడికతీత కుంభకోణం బయటపడి మరోసారి జనం ఆశ్చర్యపోయేలా చేసింది.

# నెల్లూరులో కాల్వల పూడికతీత నిధుల స్వాహా!

మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం అంటేనే అవినీతి, అక్రమాలకు నిలయమనే పేరుంది. కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల్ని వివిధ రూపాలలో స్వాహా చేసేందుకు ఇక్కడ పైరవీలు జరుగుతుంటాయి. కార్పొరేషన్ అధికారుల అండదండలు, కార్పొరేటర్ల మద్దతు వుంటే చాలు లక్షలాదిరూపాయల నిధుల్ని జేబులో వేసుకోవచ్చు. కొంచెం పలుకుబడి, పరపతి కలిగిన వారికి కార్పొరేషన్ ఆదాయ వనరుగా వుంటుంది. నగర ప్రజలు చెల్లిస్తున్న కోట్లరూపాయల పన్నులను వివిధ పనుల పేరుతో పక్కదారి మళ్లిస్తుంటారు.

కార్పొరేషన్ పాలకవర్గం, అధికారుల తీరుపై ఎన్ని ఆరోపణలు, విమర్శలు వస్తున్నప్పటికి పట్టించుకునే దిక్కులేకుండా పోయారు. దీంతో మరిన్ని అవినీతి, అక్రమాలు జరిగేందుకు ఆస్కారం ఏర్పడిందని చెప్పవచ్చు. పారిశుధ్య కార్మికులకు ప్రతి సంవత్సరం అందజేయాల్సిన వివిధ వస్తువులకు సంబంధించిన నిధులు, చెత్తబుట్టల కొనుగోలు, వీధిలైట్ల కొనుగోలు ఇలా చెప్పుకొంటూపోతే కార్పొరేషన్ పరిధిలో కొనుగోలు చేసే వస్తువులు కొండవీటి చాంతాడంత వుంటాయి. ప్రతి దానిలో కూడా అధికారపక్షం కార్పొరేటర్లు, అధికారుల ప్రమేయం కనిపిస్తుంటుంది. గత అక్టోబర్ నెలలో కురిసిన భారీవర్షాలకు నగరంలోని డ్రైనేజి కాల్వలు పూడిపోయాయి.

వీటిని పూడిక తీయిస్తే లక్షలాది రూపాయలు జేబులో వేసుకోవచ్చని భావించిన అధికారపక్షం కార్పొరేటర్లు నిధుల మంజూరు కోసం యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు తయారు చేయించారు. అధికారులు తయారుచేసిన ప్రతిపాదనలు జిల్లాకలెక్టర్‌కు పంపి దాదాపు 70 లక్షల రూపాయల్ని మంజూరు చేయించుకోగలిగారు. నగరంలోని ఒకొక్క డివిజన్‌కు లక్షా50వేల వంతున 50 డివిజన్లకు నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ నిధుల ద్వారా కొన్ని డ్రైనేజి కాల్వల్లో తూతూ మంత్రంగా పూడిక తీసి, మిగిలిన డ్రైనేజి కాల్వల గురించి పట్టించుకోకుండా వదిలేశారు. అధికారపక్షానికి చెందిన ఆనం జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాల్వల పూడికతీత కార్యక్రమం జరిగింది.

బినామీ కాంట్రాక్టర్లను సృష్టించి వారిపేరుతో ఆనం జయకుమార్‌రెడ్డి, మేయర్ భానుశ్రీలు నిధులు మంజూరు చేయించుకున్నారు. ఈ నిధుల్లో కూడా దాదాపు 20 లక్షలకు పైగా చేతులు మారినట్లు తెలుస్తుంది. కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో డ్రైనేజి కాల్వల పూడికతీతకు సంబంధించి పూర్తి వివరాలు నమోదు కాబడ లేదు. నగరంలో ఎన్ని డ్రైనేజి కాల్వలు వున్నాయి. వీటిలో మేజర్ ఎన్ని? మైనర్ ఎన్ని? ఎన్ని కాల్వల్లో పూడిక తీసారు? ఏ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారన్న తదితర సమాచారాన్ని అందించే దిక్కులేకుండా పోయారు. వివరాలు వెల్లడి చేస్తే ఎక్కడ చిక్కుల్లో పడతామోనని భయపడి ఇంజినీర్లు తప్పించుకుంటున్నారు.

డ్రైనేజి కాల్వల పూడిక తీసేందుకు మంజూరుచేసిన నిధులు ప్రక్కదారి మళ్లాయన్న ఆరోపణలు గుప్పుమన్నప్పటకీ ఎవరూ వీటి గురించి స్పందించలేదు. ప్రజలకు ఉపయోగపడే పనులకు కేటాయించిన నిధులు కొందరు అవినీతి, అక్రమాల కారణంగా దుర్వినియోగం జరుగుతున్నాయి. ప్రజాధనం అంటే మంచినీళ్లప్రాయంగా దిగమింగుతున్నారు. నిధుల ఖర్చు, దుర్వినియోగంపై ఎటువంటి విచారణ లేకుండా పోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.



నగరంలో మురికిపేరుకపోయి పారుదలలేని కాల్వలు.

అవినీతి కథ

# వాటర్ ప్లాంట్లలో అవినీతి వరద!

జిల్లాలో 40కిపైగా వున్న మంచినీటి వ్యాపారం చేసే ప్లాంట్లలో 20కి మాత్రమే ఐఎస్ఐ గుర్తింపు వుంది. మిగిలిన వాటికి లేకపోయినా గుర్తింపు వున్నట్లు వేసుకొంటున్నారు. అటువంటి ప్లాంట్ల నిర్వాహకులపై చర్యలే లేవు.



ప్రామాణికత పాటించని మంచినీటి వ్యాపారం.

వేసవి కాలం వచ్చిందంటే త్రాగునీటి సమస్య ప్రజల్ని పట్టి పీడిస్తుంటుంది. బావులలో భూగర్భజలాలు అడుగంటడం, కార్పొరేషన్ అధికారులు త్రాగునీటి సరఫరా సక్రమంగా చేయలేకపోవడం వంటి కారణాల వల్ల మార్కెట్లో లభించే నీటిని కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకోవాల్సి వస్తుంది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు నాణ్యతలేని నీటిని అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వాటర్ ప్లాంట్లలో తయారయ్యే నీటిలో దుమ్ము ధూళి వుండడం గతంలో అనేక సందర్భాలలో బయటపడింది. వాటర్ ప్లాంట్లలో తయారయ్యే నీటి గురించి అధికార యంత్రాంగం సైతం పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో దాదాపు 40 వరకు ప్లాంట్లు ఏర్పాటుచేసి వున్నాయి. వీటిలో 20 వాటర్ ప్లాంట్లకు మాత్రమే ఐఎస్ఐ గుర్తింపు వుంది. మిగిలిన వాటికి లేకపోయినా వున్నట్లు ప్యాకెట్లు, క్యాన్లపై ఐఎస్ఐ గుర్తింపు ముద్రిస్తున్నారు. ఆహార పదార్థాలలో త్రాగునీరు కూడా ఒక భాగంగా వుంటుంది. ఈ త్రాగునీరు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందా? లేదా? అని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం తనిఖీలు చేసి ధృవీకరించాల్సి వుంటుంది. అయితే ఈ ఇన్‌స్పెక్టర్లు ఏ వాటర్ ప్లాంట్‌ను ఒక్క దఫా కూడా తనిఖీ చేసిన దాఖలాల్లేవు. ఐఎస్ఐ గుర్తింపు పొందాలంటే ప్లాంట్ సామర్థ్యాన్ని బట్టి లీటర్‌కు 20 రూపాయల వంతున ఫీజు చెల్లించాల్సి వుంటుంది. నిర్వాహకులు ఇంత ఖర్చును భరించేందుకు సిద్ధంగా లేరు. ఐఎస్ఐ గుర్తింపు లేకపోయినా గుర్తింపు వున్న వాటర్‌ప్యాకెట్లు, క్యాన్లు విక్రయించే ధరలకు వాటిని విక్రయించడం సిగ్గుచేటు. నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలివేసి అనతికాలంలోనే నీటి వ్యాపారంలో కోట్ల రూపాయలు వెనకేసుకొంటున్నారు. కొళాయి, బావులలో లభించే నీటిని ఫిల్టర్‌చేసి అనంతరం క్యాన్లలో నింపి కంపెనీ సీల్‌వేసి మార్కెట్లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. వాటర్ ప్యాకెట్లు, క్యాన్లు సరైన మోతాదులో వున్నాయా? లేదా? అన్నది తూనికలు, కొలతల శాఖకు చెందిన అధికారులు పరిశీలించాలి. ప్లాంట్లలో తయారుచేస్తున్న నీటిని పరిశీలించి బాటిల్ తూకాలను ధృవీకరించిన తర్వాత మార్కెట్లోకి తరలించాల్సి వుంటుంది. ఈ శాఖాధికారులు ఆ ప్లాంట్ల వైపు కన్నెత్తి కూడా చూడరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐఎస్ఐ కోసం వాటర్ ప్లాంట్లలో బయో కెమిస్టును తప్పకుండా నియమించుకోవాలి. డిప్యూటీ డైరక్టర్ స్థాయి అధికారి ప్లాంట్‌ను తనిఖీచేసి ప్లాంట్ నిర్మాణ లోపాలను గుర్తించాలి. ఆ తర్వాతనే ప్రభుత్వం నుంచి గుర్తింపు లభిస్తుంది. ప్లాంట్ నిర్వాహకులు మాత్రం ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా, నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి నీటిని తయారు చేస్తున్నారు. మార్కెట్లో లభించే నీటి గురించి ఎవరు కూడా పరిశీలించకుండానే కొనుగోలు చేసి త్రాగుతుంటారు. నాణ్యతగాలేని నీటిని త్రాగిన వారు అనారోగ్యం పాలవుతుంటారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సక్రమంగా త్రాగునీటిని సరఫరా చేస్తే వాటర్ క్యాన్ల కొనుగోలు నుంచి కొంత ఊరట లభిస్తుంది.

ప్రభుత్వం కూడా వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు గుడ్డిగా అనుమతులు ఇస్తుండడంతో అవగాహనలేని వారు సైతం కోట్ల రూపాయలు సంపాదించాలన్న ఆలోచనతో వీటిపై మక్కువ చూపుతున్నారు. త్రాగునీటిని ఎక్కువ రోజులు నిల్వ వుంచడం వల్ల నిర్వాహకులకు ఎటువంటి నష్టం వాటిల్లదు. ఎప్పుడైనా వీటిని విక్రయించుకోవచ్చు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, తూనికలు, కొలతల శాఖ అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్లలో నాణ్యమైన త్రాగునీటిని తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

## చదవలేకపోయాను!

మస్కా అదుర్స్ చిత్రాలు హీరోయిన్ షీలాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమెను కలవగా పిచ్చాపాటీగా మాట్లాడింది. నన్ను బాగా చదివించి ఏ డాక్టర్‌నో చేయాలని మా అమ్మనాన్నలు బాగా కలలు కన్నారు. నా దగ్గర అంత సీన్ లేదు. ఎందుకనో నేను ఎప్పుడూ యావరేజ్ స్టూడెంట్‌నే. చదువు తలకు ఎక్కేదే కాదు. ఇప్పుడేమో ఎంత సేపూ షూటింగ్‌లు, కబుర్లు. ఏమాత్రం ఖాళీ దొరికినా వాక్‌మన్ పెట్టుకొని కూర్చుంటాను. లేకుంటే చుట్టుప్రక్కల వారితో మాట్లాడుతుంటాను. అదీ కుదరకపోతే నిద్రపోతాను. అంతేగానీ పొరపాటున కూడా మ్యాగజైన్లు తిరగేయనంది.

## పాత్ర నచ్చితేనే పోషణ!



యుగానికి ఒక్కడు చిత్రం ద్వారా అందరినీ ఆకట్టుకొన్న హీరోయిన్ ఆండ్రియా. తమిళంలోనే నటిస్తారా అంటే నా దగ్గరకు వచ్చిన కథలను క్షుణ్ణంగా పరిశీలిస్తాను. నా పాత్ర బాగా నచ్చితే ఒప్పుకొంటాను. తెలుగు దర్శకులొచ్చి ఈ మధ్య కొన్ని కథలు చెప్పారు. అయితే బ్యానర్ పెద్దదనో, మంచి దర్శకుడనో, లేకుంటే పెద్ద హీరో నటిస్తున్నారనో సినిమాలను ఒప్పుకోవడం నాకు నచ్చదు. సినిమాలో ఎలాంటి వస్త్రధారణ వుంటుంది. నా కోసం ఎన్ని యుగళగీతాలున్నాయి వంటివి పట్టించుకోనంటుంది ఈ అందగత్తె. అన్నట్లు ఆండ్రియా చక్కగా పాటలు కూడా పాడుతుంది.



## బాగానే తింటాను!

గోడవ చిత్రంతో అందరినీ అలరించిన హీరోయిన్ శ్రద్ధఆర్య కోతిమూక షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడింది. నేను సన్నగా కనపడుతున్నానని పెదర్థాలు తీస్తున్నారు. కాస్త నాజూకుగా వున్నాను. అంతకంటే సన్నబడే ఆలోచన లేదు. నాకు జీరో సైజుల లాంటివి సరిపోవు. నోరు కట్టేసుకొనే బాపతు కాను. ఎంతతిన్నా భారీగా ఒళ్లు చేసే తత్వం నా శరీరానిది కాదు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఏ భాషలో అవకాశమొచ్చినా నటిస్తాను. బికినీలో కనిపించను అభ్యంతరం లేదు గానీ ఐటెంపాటల్లో నర్తించనంది.

## బూతు మాట్లాడించలేరు!



సినిమాల్లో మామూలుగా మాట్లాడే మాటలు కాస్త విరుపులతో పలికితే పెడర్థాలు వస్తుంటాయి. ఉత్తరాది భామలే తెలుగు సినిమా హీరోయిన్లు కావడం వల్ల ఈ సమస్య కాస్త ఎక్కువగానే కనిపిస్తుంది. ఈ విషయమై హీరోయిన్ నమిత మాట్లాడుతూ నన్ను సంప్రదించే దర్శక నిర్మాతలు నాయికల చేత ద్వందార్థపు మాటలు మాట్లాడించే రకం కాదన్నది నా నమ్మకం. సినిమాల్లో నేను చెప్పబోయే సంభాషణల అర్థాన్ని ముందుగానే తెలుసుకొంటాను. అందువల్ల నాకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకాలేదు. అయినా నాకు తెలుగు, తమిళ భాషలు బాగా అర్థమవుతాయంటున్నది ఈ సూరత్‌భామ.





## అర్థంకాని 'ఆకాశరామన్న'

అల్లూరు రహీం

చిత్ర సమీక్ష

ఇంగ్లీషు చిత్రాలు ప్రేరణగా మన్యం ఎంటర్ ప్రైజెస్ పతాకంపై మన్యం రమేష్ నిర్మాణ సారథ్యంలో కొత్త దర్శకుడు జి.అశోక్ తీసిన ఆకాశ రామన్న చిత్రం జనరంజకంగా లేదు. ఈ సినిమా పేరుకు, కథకు అసలు సంబంధమే లేదు. చేసిన కర్మల ఫలితం ఎవరైనా అనుభవించక తప్పదన్న 'కర్మ' సిద్ధాంతం ఆధారంగా దర్శకుడు చాలా చిన్న కథను రూపొందించుకొన్నాడు. కాని స్క్రీన్‌ప్లే నడపడంలో అవగాహనా రాహిత్యం సినిమా చూస్తున్న ప్రేక్షకులను పిచ్చి పట్టించేస్తుంది. సినిమా అన్నాక నవరసాలు వుండాలి. ఈ చిత్రంలో హాస్యరసం పేరిట పరమ ఎబ్బెట్టుగా నడిపిన వేణుమాధవ్ బృందం ఎపిసోడ్ గలీజు చిత్రాలను గుర్తుకు తెస్తుంది. ఈ చిత్రాన్ని 26 రోజులు రాత్రివేళల్లోనే చిత్రీకరించినా ఈ ఫీల్ తెరపై బాగా పండలేదనాలి. అయితే ఈ చిత్రంలో స్వాముల వ్యవహారశైలిపై చిత్రీకరించిన సన్నివేశం మాత్రం బాగా పేలింది. మూడు బ్రేకుల్లో సాగే ఐటంపాట కొత్తగా అనిపించినా అది ప్రేక్షకుల తలకెక్కదు. మరోపాట ఈ చిత్రంలో లేకపోవడం, చక్రి నేపథ్య సంగీతంపై శ్రద్ధ పెట్టకపోవడం ఈ సస్పెన్స్ చిత్రానికి పెద్దలోటుగా చెప్పుకోక తప్పదు. ఆడపిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా పెంచాలన్న సందేశంతో పాటు డబ్బు కోసం మెట్రోపాలిటన్ సిటీల్లో అమ్మాయిలు తెగబడుతున్న తీరును ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర రూపేణా దర్శకుడు చూపిన తీరు ఆలోచింపజేస్తుంది. ఈ చిత్రంలో అల్లరి నరేష్, శివాజి, రాజీవ్ కనకాల, మీరాజాస్మిన్, గౌరీపండిట్‌లవి సమప్రాధాన్యమున్న పాత్రలు. అయితే దర్శకుడు సస్పెన్స్ సూత్రం ఆధారంగా ఈ పాత్రలను గందరగోళం చేసి పారేశాడు. మాటల రచయిత చంద్రశేఖర్ వ్రాసిన మాటల్లో చేసిన పాపం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎంత తప్పుకు అంత శిక్ష, మరుజన్మలో కాదు ఈ జన్మలోనే శిక్ష వంటివి బరితెగింపు వున్నవారిని నిలదీసేట్లున్నాయి. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు మోసిన అశోక్‌నే అపజయ బాధ్యత మోయక తప్పదు.

ఇక చిత్రకథలోనికి వెళ్తే రాణా (అల్లరి నరేష్) బాగా డబ్బున్న కుటుంబీకుడు. ఈయన తండ్రి మందు, కారు ఇంధనానికి మాత్రం ఏలోటు లేకుండా డబ్బులిస్తుంటాడు. జై (శివాజీ) కూడా సూపర్ మార్కెట్ల నిర్వాహకుడి కుమారుడు. ఇతనికి ఆడపిల్లలంటే పిచ్చి జాస్తి. ఇటు రాణా, అటు జైలతో కూడా విచ్చలవిడిగా తిరుగుతుంటుంది ఇష (గౌరీపండిట్). జై సూపర్ మార్కెట్‌లో పని చేసే తార (మీరాజాస్మిన్) రాణాను అమితంగా ఇష్టపడుతున్నా అతని మనసు మాత్రం ఇష వైపే వుంటుంది. ఇష తన ఇద్దరు ప్రియులకు వారి వల్లే గర్భం దాల్చానని చెప్పి చెరి ఐదు లక్షలిస్తే అబార్షన్ చేయించుకొంటానంటుంది. కాని ఈ పదిలక్షలతో పాటు పారిపోను ఓ కొత్తప్రియుడు తేజ (రాజీవ్)ను కూడా సిద్ధం చేసుకొంటుంది. ఇక్కడ నుంచే పాపపుణ్య పర్వం మొదలవుతుంది. జైతో ఇష తిరగడాన్ని తట్టుకోలేని ఆమె తండ్రి నాగబాబు (నాగబాబు) అతన్ని చంపాలన్న స్థాయికి కోపం పెంచుకుంటాడు. ఇషకు ఐదు లక్షలివ్వను రాణా, జై సూపర్ మార్కెట్‌లోనే దొంగతనం చేస్తాడు. జై కూడా ఐదు లక్షలతో ఇష ఇంటికి వెళ్తాడు. ఇష ఇంటిప్రక్కనున్న పార్కులో విగ్రహం తలపైన పడి జై చనిపోతాడు. ఈ నేరాన్ని రాణాపై మోపే వుద్దేశ్యంతో ఇష బయలుదేరగా కూతుర్ని వెతుక్కొంటూ వచ్చే నాగబాబు, జై శవాన్ని పట్టుకెళ్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద నుంచి క్రిందకు వేస్తాడు. ఆ శవం ఇష లేచి పోదామనుకొన్న తేజ కారు క్రింద పడుతుంది. రాణాను హత్యానేరంలో ఇరికించను వెళ్తుండే ఇష రోడ్డు ప్రమాదంలో చనిపోతుంది. జై హత్యానేరంపై తేజ అరెస్టు చేయబడుతాడు. సూపర్ మార్కెట్‌లో నేరానికి రాణా, అతనికి సహకరించిన తార జైలుపాలౌతారు. మొత్తం మీద ఎవరు కర్మల ఫలాలు వాళ్లు అనుభవిస్తారు. ఈ సినిమాకు కర్మబట్టి వచ్చామా అన్న ఆలోచన చేస్తూ ప్రేక్షకులు హాల్ బయటకు వచ్చేలా చేస్తున్నాడు ఆకాశరామన్న



హాస్టళ్ల భోజనంలో కూరలు కరవు.

# హాస్టళ్లలో ఆకలి కేకలు

ఒకవైపు పదవ తరగతి పరీక్షలు దగ్గరపడుతుండడంతో రాత్రింపగళ్లు కఠోర దీక్షతో చదువుతున్న విద్యార్థులు, మరోవైపు అర్థాకలితో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి బిసి సంక్షేమ వసతి గృహాల్లో నెలకొనింది. హాస్టల్ విద్యార్థులకు అన్నివిధాల సహకారం అందిస్తామని చెప్పే ప్రభుత్వం ఆచరణలో మాత్రం హామీలను నిలబెట్టుకోలేక పోతున్నది. దీంతో హాస్టళ్లలో వుండే విద్యార్థులు కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖలకు చెల్లించాల్సిన నిధులు సక్రమంగా చెల్లించకపోవడంతో భోజన సౌకర్యాలు కల్పించడానికి అధికారులు పలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా 87 బిసి సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇందులో 8,966 మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రతినెల భోజనాల కోసం 1344 క్వింటాళ్ల బియ్యం అవసరమవుతుంది. ఈ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ సరఫరా చేస్తుంది. దీనికిగాను రూ.5.37 లక్షలను బిసి సంక్షేమ శాఖకు చెల్లిస్తుంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ఇంతవరకు జరగకపోవడంతో పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరా నిలిపి వేసింది. దీంతో విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టలేక అధికారులు చేతులెత్తేశారు. టెన్త్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు తిండి లేక నీరసించి పోతుండడంతో జిల్లా అధికారులు ఇతర శాఖల నుంచి నిధులు తెచ్చి అరకొరగా ఆహార పదార్థాలను అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు రోజుకు 450 గ్రాముల భోజనం పెట్టాల్సి వుండగా 150 గ్రాముల భోజనం మాత్రమే పెడుతుండడంతో విద్యార్థులు కడుపు మాడ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

# వేదవ్యాసలో స్మార్ట్ క్లాస్!

## విద్యార్థులకు ఎంతో మేలు

సాంకేతిక పరిజ్ఞానం క్రొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో తరగతి గది స్వరూపం మారిపోతోంది. పాఠ్యాంశాల బోధనలో సాంకేతికతను జోడించినట్లయితే అవి విద్యార్థులకు ఎంతగా ఉపయోగపడుతాయో స్మార్ట్ క్లాసులు నిరూపిస్తున్నాయి. ఒక అంశాన్ని ఎంతగా వివరించి చెప్పినా దానిని దృశ్యరూపంలో చూపడం వల్ల విద్యార్థులకు సులభంగా అర్థం కావడంతోపాటు ఎక్కువ కాలం గుర్తుండి పోతుంది. అందివచ్చిన ఈ టెక్నాలజీని నెల్లూరు నగరానికి అందుబాటులోనికి తీసుకొని వచ్చింది వేదవ్యాస స్కూలు యాజమాన్యం. సాధారణంగా తరగతి గదుల్లో వుండే బ్లాక్ బోర్డు, చాక్‌పీస్ స్థానంలో ఇక డిజిటల్ స్క్రీన్‌లు వచ్చేశాయ్. నల్లబల్లపై బొమ్మలు గీస్తూ, ఈక్వేషన్‌లు వ్రాస్తూ ఉపాధ్యాయులు ఎంత బోధించినా బుర్రకెక్కని పాఠాలు ఇప్పుడు పెద్ద టచ్ స్క్రీన్‌పై చెబుతుంటే ఇట్టే గుర్తుండి పోతాయి. నగరంలో ప్రప్రథమంగా ఈ మార్పుకు శ్రీకారం చుట్టింది మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస స్కూల్. ఎడ్యుకాంప్ లాంటి అంతర్జాతీయ సంస్థలు అందుబాటులోకి తెచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ విద్యార్థులకు ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో ఖర్చుకు వెరవక ఆ టెక్నాలజీని ఆహ్వానించారు. ప్రతి తరగతి గదిలో డిజిటల్ టచ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. వీటికి కంప్యూటర్‌లను అనుసంధానం చేశారు. సుద్ద ముక్కకు బదులు డిజిటల్ పెన్‌తో టచ్ స్క్రీన్‌పై పాఠ్యాంశాల బోధన సాగుతుంది.

ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అవసరమైన వివిధ సబ్జెక్టులలో, పలు అంశాలకు సంబంధించి వేలాది వీడియో మాడ్యుల్స్, యానిమేటెడ్ వీడియోలు అందుబాటులోకి తెచ్చారు. సాంకేతికతతో రూపుదిద్దుకొన్న తరగతి గదిలోకి ప్రవేశించడం వల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పట్ల లోతైన అవగాహన ఏర్పడుతుంది. దృశ్యరూపంలో వుండడంతో విపులంగా వున్న పాఠాల్ని మరచిపోయే పరిస్థితి వుండదు. యానిమేటెడ్ వీడియోలు కావడం వల్ల పిల్లలకు విజ్ఞానంతోపాటు వినోదం కల్గుతుంది. ముఖ్యంగా సైన్స్ సబ్జెక్టులో వివిధ ప్రయోగాల గురించి చెప్పడం కంటే ఆ ప్రయోగాలను స్క్రీన్‌పై చూస్తూ చేయడం వల్ల ఆయా విషయాల్లో విద్యార్థులకు అవగాహన పెరుగుతుంది.



వేదవ్యాసలో స్మార్ట్‌క్లాస్ విధానాన్ని ప్రారంభిస్తున్న నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ప్రక్కన రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, స్కూల్ అధినేతలు బాలాజీ, గిరి.

వేదవ్యాస స్కూలులో ప్రప్రథమంగా ఏర్పాటైన స్మార్ట్ క్లాస్‌ను రూరల్, నగర శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన స్కూలు యాజమాన్యాన్ని వారు అభినందించారు. కరస్పాండెంట్ ఎ.వి. బాలాజీ మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమైనా పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని ఈ స్మార్ట్ క్లాస్ విధానాన్ని ప్రవేశపెట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో చాట్ల నరసింహారావు, గిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆటోలు అదుపులో నడిచేనా?

# షేర్ ఆటోల ఛార్జీలివి!

సింహపురి ఆటో డ్రైవర్స్ యూనియన్ అన్ని రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి సమావేశ అనంతరం షేర్ ఆటోల ఛార్జీలను ప్రకటించింది. మెయిన్ రోడ్డులో అయ్యప్పగుడి నుంచి వీఆర్‌సి వరకు ఐదు రూపాయలు. ఆపైన ఏడు రూపాయలు. వేదాయపాళెం నుంచి గాంధీబొమ్మ వరకు ఐదు రూపాయలు. ఆపైన ఏడు రూపాయలుగా చెల్లించాలి. ఆత్మకూరు బస్టాండ్ నుంచి కొండాయపాళెంగేటు వరకు

**ఎక్కిదిగితే ఏడు రూపాయలు ఇవ్వాల్సిల్లేదు.**

ఐదు రూపాయలు. డైకస్‌రోడ్డు నుంచి వీఆర్‌సి వరకు ఐదు రూపాయలు. ఆపైన ఏడు రూపాయలుగా నిర్ణయించారు. మినీ బైపాసు రోడ్డులో ఆత్మకూరు బస్టాండ్ నుంచి వనంతోపు వరకు ఐదు రూపాయలు. ఆపైన ఏడు రూపాయలు. పడారుపల్లి – ముత్తుకూరు గేటు మధ్య ప్రయాణానికి ఐదురూపాయలు వసూలు చేస్తారని ఆటో డ్రైవర్స్ యూనియన్ కన్వీనర్ జె.వి.నారాయణ స్పష్టం చేశారు.

# సంక్షేమ పథకాలపై సమీక్ష



మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.

రాష్ట్ర మునిసిపల్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ నెల 12వ తేది కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. త్రాగునీటి సరఫరా, విద్యుత్‌కోత, వ్యవసాయ పంట దిగుబడి, రైతులకు గిట్టుబాటు ధర తదితర అంశాలపై అధికారులతో చర్చించడం జరిగింది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోజుకు 7గంటలు విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మత్తులకు గురైన సమాచారం అందిన వెంటనే 24గంటల్లోగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకోవాలని ఆదేశించారు. అలాగే త్రాగునీటి సరఫరాలో అంతరాయం, పౌరసరఫరాలను పర్యవేక్షించే జిల్లా జాయింట్ కలెక్టర్ తరచూ సమీక్షాసమావేశాలు ఏర్పాటు చేసి సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోట్ల రూపాయల ఖర్చు చేసి అమలు చేస్తున్న ప్రజాపంపిణీ కార్యక్రమం మరింత పటిష్టంగా అమలు చేయడంతోపాటు అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారికి సహకరిస్తున్న అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొంటే పరిస్థితులన్నీ చక్కబడతాయి.

# నెల్లూరు విద్యార్థికి గోల్డ్‌మెడల్

## కష్టపడి చదివి సాధించిన రాజేశ్వరి

నెల్లూరు నగరానికి చెందిన కేతా రాజేశ్వరి ఎంకామ్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు 12వ తేది ఎస్వీయూనివర్శిటీ బంగారు పతకాన్ని గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అందించింది. రాజేశ్వరి కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు కేతా సుబ్బారావు కుమార్తె. తండ్రి ఆర్థికస్థితి అంతంత మాత్రం కావడంతో రాజేశ్వరి ట్యూషన్ లేకుండానే కష్టపడి చదివి బంగారు పతకాన్ని సాధించింది. చదువుల తల్లి రాజేశ్వరికి మా అభినందనలు.



నెల్లూరులోని జైన్‌గోల్డ్ నేతృత్వంలో లక్కీడ్రా విజేత చైతన్యకు స్కూటీని అందిస్తున్న నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, జైన్‌గోల్డ్ అధినేత మణిలాల్.

## మంత్రివర్గ విస్తరణ

మొదటి పేజీ కొరవ

పోటించి అమర్ అనే ట్రేడ్ యూనియన్ నాయకుడికి ఆ పదవి కట్టబెట్టాడు. అప్పుడే దీనిపైన విమర్శలు వచ్చాయి. పైరవీకారుడిగా మాత్రమే అమర్‌కు పేరు. పాత్రికేయ లోకంలో అయనకు చీపురు పుల్ల విలువ లేదు. అయినాసరే వైఎస్ ఆయన్ను ఐదున్నరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగించాడు. ఇప్పుడు రోశయ్య గారు కూడా తిరుమలగిరి సురేంద్ర అనే అనామక పాత్రికేయుడికి ఆ ఉన్నత పదవి అప్ప చెప్పాడు. రోశయ్యతో చాలాకాలం నుంచి దగ్గరగా మెలగడం తప్ప తిరుమలగిరికి పాత్రికేయుడిగా గుర్తింపు లేదు.

రేపటి మంత్రివర్గ విస్తరణలో సైతం రోశయ్య ఇదే వైఖరి అవలంభించి తన స్వంత మనుషులను దగ్గర పెట్టుకోవాలనుకొంటే మాత్రం చాలా మార్పు చేర్పులు వుంటాయి. ఇప్పటికే మర్రి శశిధర్‌రెడ్డి, టిజి.వెంకటేష్ వంటి రోశయ్య సన్నిహితులకు పదవీ తాయిలం ఖాయం అని ప్రచారం జరుగుతున్నది. ఈ కోణంలో ఆలోచన చేస్తే జగన్ అనుచరులుగా ముద్రపడి, జగన్‌తో కలిసి తనను ఇబ్బంది పెట్టిన ఆనం రామనారాయణరెడ్డి, రఘువీరారెడ్డి, బాలినేని శ్రీనివాస్ వంటి వారిని పక్కకు తప్పించే అవకాశం వుందని అంచనా.

ఏది ఏమైనా ఏప్రెల్ రెండవ వారంలోపల మంత్రివర్గ విస్తరణ ఖాయం.



చెన్నైలోని తెలుగు బ్రాహ్మణ సభ నేతృత్వంలో సంఘ సేవకుగాను ఉగాది పురస్కారాన్ని నెల్లూరులోని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ అజయ్‌కుమార్ దంపతులకు అందజేస్తున్న చెన్నై బ్రాహ్మణ మహాసభ నిర్వాహకులు.

## ఆనం సోదరుల ప్రాభవం

16వ పేజీ కొరవ

శాసనసభ సమావేశాలకు బయలుదేరే ముందు కూడా, ప్రభాకర్‌రెడ్డి కాంట్రాక్ట్ పనుల మీద తాను ప్రశ్నలు సంధిస్తున్నానని బహిరంగ ప్రకటన చేశాడు. శాసనసభలో ఆయన పరువు ఉతికి ఆరవేస్తానని హెచ్చరిక చేశాడు. కారణం లేని ప్రకోపం ఇది. నిజానికి శాసనసభలో ఆయన చేసింది ఏమీ లేదు. ప్రభాకర్‌రెడ్డితో పాటుగా మరొక ఐదుగురు కాంట్రాక్టర్ల మీద ప్రశ్నలు వేసిన మాట నిజం. కానీ వాటిలో ఒకటి తప్ప తతిమావి అసలు సభ ముందుకు రాలేదు. జాబితాలోకి వచ్చిన ప్రశ్నలను ఉపసంహరించుకోవడం వెనుక ఏ మతలబులు జరిగాయో మనకైతే తెలియదు. కానీ ఆ ప్రశ్నలు ప్రభాకర్‌రెడ్డిని రెచ్చగొట్టాయి. జిప ఛైర్మన్ విషయంలో కూడా అనవసరంగా నోరు పారేసుకొన్నాడు వివేకానందరెడ్డి.

మొత్తం మీద జిల్లా రాజకీయాలలో ఆనం సోదరులు దాదాపుగా ఒంటరివారైపోయారు. గతంలో పనబాక లక్ష్మీతో సన్నిహితంగా మెలిగేవారు. ఇప్పుడు ఆమె వైపు ముఖం తిప్పి చూపడం లేదు. దానితో ఆమె కూడా వారిని వదిలి పెట్టింది. నేదురుమల్లి జనార్దనరెడ్డితో వారి సంబంధం విచిత్రమైనది. వీధిలో జనార్దనరెడ్డిని తిడతారు. ఇంటికి వెళ్లి ఆయన కాళ్లకు మొక్కుతారు.

నెల్లూరు నగర నియోజకవర్గంలో తనను ఓడించి, కష్ట పెట్టారన్న బాధతో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ బృందం రాజీవ్‌భవన్ ఏర్పాటు చేసినప్పుడు, చాలా చులకనగా మాట్లాడాడు వివేకానందరెడ్డి. దాన్నొక చిల్లర అంగడిగా అభివర్ణించాడు. రాజీవ్‌భవన్ నిర్వాహకులు కూడా తమ పోరాటం ఆనంవారి మీద అని బహిరంగంగా చెప్పేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి తిరగబడింది. భానుశ్రీ మీద ఎసిబి దాడి తర్వాత తమ అంతరంగికులతో జరిపిన సమావేశంలో వివేకానందరెడ్డి రాజీవ్‌భవన్‌ను తేలికగా తీసుకోవద్దని, వారి మీద పోరాటం చేయాలని తమ అనుచరులకు బోధించారట. అంటేవారు వీరైనారన్నమాట. పెట్టిన ఆరు నెలలలోనే అరవై ఏళ్ల రాజకీయ కుటుంబాన్ని అల్లాడించడం ద్వారా రాజీవ్‌భవన్ జిల్లా రాజకీయాలలో చరిత్ర సృష్టించింది. అందుకు వారికి అభినందనలు తెలపాలి.

## జగన్

మొదటి పేజీ కొరవ

అప్పుడు జగన్ దాన్ని నిరాకరించాడు. తనకు ముఖ్యమంత్రి పదవి తప్ప మరేమీ వద్దని తెగేసి చెప్పాడు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అలిగితే నష్టం తనకే అన్న నిజం బాగా అవగతమైంది కాబట్టి, ఇప్పుడీ ప్రతిపాదన వస్తే జగన్ కూడా కాదనక పోవచ్చునని భావిస్తున్నారు పరిశీలకులు.

## పార్టీ ప్రాతిపదికన

16వ పేజీ కొరవ

లేదు. మంత్రులు కూడా ఉత్తచేతులు చూపుతున్నారు. కరెంట్ సమస్య జనాన్ని చాలా ఇబ్బంది పెడుతున్నది. చీకటిలో మ్రగ్గవలసి రావడంతో ప్రజలు ప్రభుత్వం పట్ల కోపంతో కుతకుత ఉడికి పోతున్నారు.

ఇన్ని సమస్యల మధ్య పార్టీ టిక్కెట్లతో ఎన్నికలకు వెళ్తే, తమ గది అధోగతి కాక తప్పదన్న భీతితో వణికి పోతున్నారు ఎమ్మెల్యేలు. పార్టీ ప్రాతిపదికన ఎన్నికలు జరిగి, మునిసిపల్ ఛైర్మన్లు, మేయర్లుగా ప్రతిపక్షాల వారు గెలిస్తే తమ తమ నియోజకవర్గాలలో చాలా ఇబ్బందులొస్తాయన్నది వారి భయం. స్థానిక రాజకీయాలలో ఎమ్మెల్యేల కంటే మునిసిపల్ ఛైర్మన్ శక్తివంతుడన్నది తెలిసిన నిజం. పురపాలక సంస్థలు ప్రతిపక్షంలో చేతిలో పెట్టి, ఎమ్మెల్యేలుగా తాము చేయగల్గింది ఏదీ వుండదని వారికి తెలుసు. అందువల్లనే రేపటి ఎన్నికలలో పార్టీ టిక్కెట్ల పద్ధతి తొలగించమని వేడుకొంటున్నారు.

రోశయ్య కూడా ఈ ప్రతిపాదన పట్ల సానుకూలంగా వున్నాడని చెప్తున్నారు. పార్టీ ప్రాతిపదికన ఎన్నికలు జరిగి అధిక స్థానాల్లో పార్టీ ఓడిపోయిందన్న ప్రచారం జరిగితే తమ పదవికి కూడా ఇబ్బందే అన్నది ఆయన ఆలోచన. టిక్కెట్లు లేకుండా ఎవరికివారు స్వతంత్రంగా పోటీ చేసే వీలు కల్పిస్తే, గెలిచిన వారంతా తన వారని చెప్పుకోవచ్చు. ప్రతిపక్ష అభ్యర్థులను కూడా ఎన్నికల తర్వాత పార్టీలో చేర్చుకోవచ్చు. అందువల్ల ఎమ్మెల్యేల మీద సానుభూతితో కంటే, తన పదవి రక్షణ మీద మక్కువతోనైనా ముఖ్యమంత్రి స్థానిక సంస్థల ఎన్నికలలో టిక్కెట్ల పద్ధతి తొలగిస్తాడని చెప్తున్నారు.

## జనవాణి

2వ పేజీ కొరవ

కళ్యాణ మండపం చక్కని వుదాహరణ. ప్రవేటు వ్యక్తుల నేతృత్వంలోని కళ్యాణ మండపాలు బ్రహ్మాండమైన వసతుల నడుమ నడుస్తున్నప్పుడు టిటిడి తన నేతృత్వంలో కళ్యాణ మండపాలను ఎంతో గొప్పగా నిర్వహించాలి. కాని ఇప్పటి బోర్డు అనవసర విషయాలకు కోట్లు ఖర్చుపెడుతూ అవసరమైన వాటిని పట్టించుకోవడం లేదు.

– సి.హెచ్.సురేష్‌బాబు, నెల్లూరు

## సచిన్ టెండూల్కర్‌కు భారతరత్న ఇవ్వాలి!

క్రికెట్ ఆటలో ఎదురులేని క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్. ఈ ఆటలో ఇతర క్రీడాకారులు నెలకొల్పి వుండిన పరుగుల రికార్డులను సచిన్ తుడిచి పెట్టేశాడు. భవిష్యత్తులో సచిన్ నెలకొల్పిన రికార్డులు అధిగమించడం ఏ క్రీడాకారునికి సాధ్యం కాదు. ఆయనను భారతరత్న బిరుదుతో సత్కరించడం సముచితంగా వుంటుంది.

– భట్టారం పట్టాభిరామయ్య, నెల్లూరు

## నెల్లూరు మిత్రుడు బంగోరె!

మొట్టమొదటి కన్యాశుల్కం – బంది గోపాలరెడ్డి స్కాలర్ ఎడిషన్ 1969లో చదివాను. అటువంటి రుచి లోగడ ఎరుగను. ఆ దరిమిలా కూడా బహు అరుదు. బంగోరె వేమన పద్యాల పరిష్కరణ, ఆతర్వాత తాతాచార్ల కథలు చాలా అరుదైన పరిశోధన. విశాఖపట్నం రీడింగ్ రూమ్‌లో ఒకసారి, ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజిలో మరోసారి బంగోరెను ప్రత్యక్షంగా చూసాను. "తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు... తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు" మరి బంగోరె పరిశోధనలన్నీ కుందేటి కొమ్ము సాధించి పెట్టినట్టేనని చెప్పుకోవాలి. బంగోరె రచనలపై ఎవరైనా ఒక విపులమైన సాధికారికమైన వ్యాసం ప్రచురిస్తే బాగుంటుంది.

– డాక్టర్ మానేపల్లి, ఎలమంచిలి

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. లాకౌట్ చేసిన అపాచీని చూసేందుకు వచ్చిన రాఘవులు విలేకరులతో మాట్లాడుతూ కల్కి ఆశ్రమం, అపాచీ వ్యవహారాలు నిగ్గుతేల్చేందుకు వచ్చానన్నారు. మన వారిపై విదేశీయులైన అపాచీ యాజమాన్యం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నైజాం దొరల మాదిరి ప్రవర్తిస్తున్న అపాచీపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### బాబా మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలు

గాంధీనగర్ శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో 24తేది నుంచి 26 తేది వరకు శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే ప్రత్యేక పూజలలో భక్తులు అధికంగా పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు మందిర కమిటి.

### సినీ ఫక్కీలో చోరీ

బ్యాంకు నుంచి డబ్బు డ్రాచేసుకు పోతున్న వ్యక్తి వద్ద నుంచి సినీ ఫక్కీలో చోరీ చేసిన ఘటన 15వ తేది నెల్లూరు నగరంలో జరిగింది. పప్పుల వీధికి చెందిన వ్యాపారి వెంకటేశ్వర్లు రైల్వేఫీడర్స్ రోడ్డులోగల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో 2.8 లక్షలు డ్రాచేసి బైక్‌లో పెట్టుకొని ఆత్మకూరు బస్టాండ్ వద్దకు వచ్చాడు. సిగ్నల్ పడివుండగా వాహనం ఆపిన వెంటనే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి నగదు తస్కరించుకొని వెళ్ల దంతో పావం ఎంతగా అరచి కేకలు పెట్టినా అరణ్యరోదనే అయ్యింది. పట్టపగలు జరిగిన ఈ సంఘటనతో జనం విస్తు పోయారు.

### సిగ్నల్స్ సమస్య

తోటపల్లి గూడూరు మండలంలోని బిఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సక్రమంగా సిగ్నల్స్ వుండక పోవడం, మాట్లాడే సమయంలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో సెల్‌ఫోన్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఇతర ప్రైవేట్ నెట్‌వర్కులు బాగా పనిచేస్తూ వుండగా బిఎస్ఎన్ఎల్ ఫోన్‌లు మాత్రం ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్నామని మండలంలోని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. టెలికాం అధికారులు సాంకేతిక సమస్యను పరిష్కరించి వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సి వుంది.

# ఖజానాలో బిల్లుల నిలిపివేత

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు మరో షాక్ ఇచ్చింది. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి నుంచి ఇంకా కోలుకోలేక పోవడంతో ఉద్యోగుల జీతభత్యాలు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరపలేకపోతోంది. గత నెలలో మొదటివారంలో బిల్లుల చెల్లింపులను తాత్కాలికంగా కొద్దిరోజుల పాటు నిలిపి వేయమని ఉత్తర్వులు జారీ అయ్యాయి. తర్వాత కేవలం వేతనాలను మాత్రమే చెల్లించాలని ఖజానా కార్యాలయానికి ఆదేశాలొచ్చాయి. దీంతో వూపిరిపీల్చుకున్న ఉద్యోగులు తిరిగి మార్చి నెలలో బిల్లులు చెల్లింపులను నిలిపివేయమని ప్రభుత్వం ఆదేశించడంతో ఆందోళన చెందుతున్నారు.

### కాంట్రాక్టర్ల బిల్లులు ఆగాయి!

ప్రభుత్వశాఖలో విధులు నిర్వహించే సిబ్బందికి ఖజానా కార్యాలయాల ద్వారా ప్రతినెల వేతనాలు చెల్లించడం జరుగుతుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సిబ్బందికి చెల్లించాల్సిన వివిధరకాల బిల్లులతోపాటు కాంట్రాక్టు పనులు చేపట్టిన వారికి సైతం బిల్లులు చెల్లించాల్సి వుంటుంది. అయితే రాష్ట్రప్రభుత్వం తాజాగా జారీచేసిన ఉత్తర్వులు కారణంగా కేవలం వేతనాలు మాత్రమే మంజూరు చేసే అవకాశం వుంటుంది. ఆర్థిక సంవత్సరం చివరిలో వేతనాలతోపాటు బిల్లులు మంజూరు అవుతాయని భావించిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వులు నిరాశ కలిగించాయి.

ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడి కేంద్రాలు నిర్వహించే భవనాలకు అద్దె కూడా చెల్లించే అవకాశం లేకుండా పోయింది. అలాగే వివిధ పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల బిల్లులు చెల్లింపులు జరగాల్సి వుండగా, వీటికి కూడా ప్రభుత్వం తాత్కాలిక బ్రేకు వేసింది. దీంతో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో మిగిలిన కాంట్రాక్ట్ పనులు పూర్తిచేయడం కష్టమని భావిస్తున్నారు. ఇకపోతే సాంఘిక సంక్షేమశాఖలో కూడా బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడం క్రిందిస్థాయి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



నెల్లూరులోని జిల్లా ఖజానా కార్యాలయం.

### హాస్టళ్లలోని విద్యార్థులకు ఇక్కట్లు

హాస్టల్ భవనాల అద్దె, కూరగాయలు, విద్యుత్ బిల్లులు, విద్యార్థులకు చెల్లించాల్సిన కాస్మొటిక్ ఛార్జీలు మొత్తం నిలిచిపోయాయి. బయట అప్పులు చేసి కూరగాయలను కొనుగోలు చేసి వార్డెన్లు బిల్లులు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారు. ప్రస్తుతం వేతనాల తప్ప ఇతర బిల్లులు చెల్లింపులు చేయడం కుదరదని ఖజానా అధికారులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిస్తే వచ్చే సంవత్సరం బిల్లులు మంజూరవుతాయో లేదో అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ఖజానా కార్యాలయాలలో బిల్లులు మంజూరుకు సంబంధించిన ఫైళ్లు పేరుకుపోయి వున్నాయి.

# గాడి తప్పిన ప్రజా పంపిణీ వ్యవస్థ

అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ప్రజాపంపిణీ వ్యవస్థపై ఖర్చు చేస్తున్న ఫలితాలు మాత్రం ప్రజలకు దక్కడం లేదు. రేషన్‌షాపు డీలర్లు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం కారణంగా క్రిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

మండల తహశీల్దార్ కార్యాలయం నుంచి స్టాక్‌పాయింట్ల వరకు ప్రతిఒక్కరికి మామూళ్లు సమర్పించుకుంటారు డీలర్లు. రేషన్‌షాపుకు స్టాక్ పాయింట్ నుంచి సరుకులు తీసుకెళ్లిన డీలర్లు ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. ప్రజలకు పంపిణీ చేసే సరుకులను తూకం వేసే క్రమంలో కూడా చాలా వ్యత్యాసం వుంటుంది. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొంటున్న డీలర్లు అవకతవకలకు పాల్పడుతున్నారు. బియ్యం, కిరోసిన్ పంపిణీలో ఇవి అధికంగా చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలోని 46 మండలాల్లో దాదాపు 1856 రేషన్‌షాపులు ఏర్పాటు చేసి వున్నాయి. ఈ రేషన్‌షాపులకు నిత్యావసర సరుకుల సరఫరా చేసేందుకు 17 స్టాక్‌పాయింట్లు వున్నాయి. మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాచారం అందిన వెంటనే స్టాక్‌పాయింట్ల నుంచి కేటాయించిన సరుకులు సరఫరా అవుతాయి. రేషన్‌షాపుకు నిర్దీత సమయంలో సరుకులు చేరిన వెంటనే వీటిని ప్రజలకు పంపిణీ చేయాల్సి వుంటుంది. ప్రజలకు రెండు రూపాయలకే కిలో బియ్యం సబ్సిడీ క్రింద అందజేయడం వలన గ్రామీణ ప్రాంత ప్రజలందరు కూడా వీటిని తప్పకుండా కొనుగోలు చేస్తుంటారు. అయితే రేషన్ షాపు డీలర్లు ఇక్కడ కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు.



అన్ని వ్యవహారాలకు మూగసాక్షి నెల్లూరులోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం.

ప్రజలకు పంపిణీ చేయాల్సిన సరుకులను ఆలస్యంగా తీసుకొచ్చి రెండు, మూడు రోజుల పాటు వీటిని విక్రయించి ఆ తర్వాత స్టాక్ లేదని కొందరు డీలర్లు చెబుతున్నారు. సబ్సిడీ బియ్యాన్ని కిలో 8 రూపాయల వంతున బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కిరోసిన్ పంపిణీలో కూడా ఇదే తంతు జరుగుతుంది. కొన్ని గ్రామాలలో అయితే ఒక నెలలో కిరోసిన్ అసలు పంపిణీ జరగడం లేదు. కొలతలో అవకతవకలను పాల్పడుతున్న డీలర్లు లీటర్ కిరోసిన్‌ను 15 రూపాయలకు వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రేషన్‌షాపులో లభించే బియ్యం బయట మార్కెట్లు 15 రూపాయలు, కిరోసిన్ 20 రూపాయల ధరలకు విక్రయిస్తున్నారు వ్యాపారులు.

**• భానుశ్రీ మీద ఏసిబి దాడితో...**

# దెబ్బతిన్న ఆనం సోదరుల ప్రాభవం!



మోకాలి మీద కొడితే మూతి పళ్లు రాలినట్లు నెల్లూరు మేయర్ భానుశ్రీ మీద జరిగిన ఏసిబి దాడి, జిల్లాలో ఆనం సోదరుల రాజకీయ ప్రాభవాన్ని అతి దారుణంగా దెబ్బ తీసింది. నిజానికి ఏసిబి దాడి జరిగింది భానుశ్రీ మీద కాదు, ఆమె భర్త, విద్యుత్ శాఖ డివిజన్ ఇంజనీర్ సుబ్బరాజు మీద. సాంకేతికంగా ఆయన ప్రభుత్వ ఉద్యోగి కాబట్టి, అక్రమ ఆస్తులు కూడబెట్టింది భానుశ్రీ అయినా, చట్టం ప్రకారం సుబ్బరాజు మీద మాత్రమే చర్య తీసుకోగల్గింది ఏసిబి శాఖ. అందువల్లనే ఈ దాడి భానుశ్రీ మీద జరిగినట్లుగానే ప్రజలలో ప్రచారం వచ్చింది. భానుశ్రీ అంటే ఆనం వారికి ఎంత దగ్గరి మనిషో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గత ఆరేడేళ్లలో ఆమె ప్రక్కన లేకుండా ఒక్క సభలో పాల్గొనలేదు వివేకానందరెడ్డి. ఆమె ఫోటో లేకుండా ఒక్క ఫ్లెక్స్ బోర్డు నగరంలో తగిలించలేదు. చిన్నచిన్న అంగళ్ల ప్రారంభానికి తనను పిలవడానికి వచ్చే వ్యాపారులను కూడా, మేడంను కూడా పిలిస్తేనే వస్తానని షరతు పెట్టేవారాయన. ఆమెతో ఆనం కుటుంబానికి అంత దగ్గర సంబంధాల వల్లనే ఇప్పుడు ఆమె మీద ఏసిబి దాడి, వారిని రాజకీయ పరాభవానికి గురి చేసింది. ఈ దాడి జరుగుతుందన్న సమాచారం ఎంతో ముందుగానే వచ్చినప్పటికీ, దాన్ని నివారించడం వారి చేత కాలేదు. ఆ అభిప్రాయం సాధారణ ప్రజలలోనే కాకుండా జిల్లా అధికారులందరిలో ఏర్పడుతున్నది. ఇంతకాలం ప్రభుత్వం అంటే ఆనం కుటుంబమే అని భావించి, వారి అడుగలకు మడుగులొత్తిన అధికారులు జాగ్రత్త పడుతున్నారు. వారిని నమ్ముకొంటే రేపు తమకూ ఇదే గతి పడుతుందన్న భయంతో వణికి పోతున్నారు. కాంగ్రెస్‌పార్టీ పరంగా కూడా చాలా పల్చబడి పోయారు ఆనం సోదరులు. హైదరాబాద్ స్థాయిలో వారి మాట వినే వారు లేరన్న భావన కాంగ్రెస్ కార్యకర్తలలో ఏర్పడుతున్నది.



వైఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో తమకు ఎదురు లేదన్న గర్వంతో విర్రవీగారు ఆనం సోదరులు. ఎంతటివారు కూడా తమనేమీ చేయలేరన్న ధీమాతో నిబ్బరంగా వుండినారు. ఆ భరోసాను పటాపంచలు చేసింది ఈ పరిణామం. ఒక్కసారిగా జిల్లా రాజకీయాలలో దిక్కులేని పక్షుల వలె మిగిలారు వారు. తమకీ దుర్గతి పట్టడానికి కారకులు సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిప ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డిలిద్దరే అని ఆక్రోశిస్తున్నారు. నిజానికి ఈ ఏసిబి దాడికి సమాచారం సేకరించింది, మూడు నెలలపాటు కష్టపడి, ఖర్చు పెట్టుకొని, వూరూరు తిరిగి శ్రమపడింది కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితర రాజీవ్‌భవన్ నిర్వాహకులు. ఏసిబి అధికారులకు వారు సమగ్రమైన, సంపూర్ణమైన సమాచారం, రిజిష్టర్డ్ పత్రాల సర్టిఫైడ్ కాపీలతో సహా అందజేసింది వారే. ఆ సాక్ష్యాలు తిరుగులేని రీతిలో వుండడంతో దాడి జరపక తప్పలేదు ఏసిబికి. అయితే ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిల సహకారం లేకుంటే రాజీవ్‌భవన్ శక్తి చాలదన్నది ఆనం సోదరుల అభిప్రాయం. అందువల్లనే వారిద్దరి మీద తమ కక్ష సాధింపుకు రంగం సిద్ధం చేసుకొంటున్నారిప్పుడు.

నిజానికి అటు ప్రభాకర్‌రెడ్డి కానీ, ఇటు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కానీ సాధు పురుషుల క్రింద లెక్క. వివాదాలలో తల దూర్చడం, రాజకీయ బల ప్రదర్శనలు చేయడం వారికెప్పుడూ అలవాటు లేదు. ప్రతీకార చర్యలు అసలు తెలియవు. కానీ వారిద్దరినీ అకారణంగా రెచ్చగొట్టాడు ఆనం వివేకానందరెడ్డి.

కొరవ 14వ పేజీలో

## భానుశ్రీపై దాడితో ప్రకంపనలు



నెల్లూరు మేయర్ నందిమండలం భానుశ్రీ ఇంటి మీద అవినీతి నిరోధకశాఖ జరిపిన దాడులు రాష్ట్ర కాంగ్రెస్ మొత్తంలో ప్రకంపనలు సృష్టించాయి. మంత్రివర్గంలో పలుకుబడి కల్గిన నేతగా ప్రచారంలో వున్న ఆనం రామనారాయణరెడ్డి స్వంత మనిషి, అత్యంత దగ్గరి అనుచరురాలి మీద ఏసిబి దండ ప్రయోగం చేయడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి రోశయ్య పైకి కనిపించేంత సాధువు కాదని, తనను కష్టపెట్టే వారిని దావబాదడానికి అవకాశం వస్తే ఎంత మాత్రం వదిలి పెట్టడని ఈ సంఘటన రుజువు చేసిందన్నది వారి అభిప్రాయం. దానితో ముఖ్యమంత్రి పట్ల తేలిక భావంతో వున్నవారంతా ఉలిక్కి పడుతున్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడి, ముఖ్యమంత్రి కుర్చీలో కుదురుగా కూర్చున్న రోశయ్యను తేలికగా తీసుకొంటే తంటాలు తప్పవనే భయం అందరిలో కల్గుతున్నది. దానితో నిన్న మొన్నటి వరకు ముఖ్యమంత్రితో ఎడముఖం పెడముఖంగా ప్రవర్తించిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ పని లేకున్నా శాసన సభలో సిఎం పేషీకి వెళ్లి దండం పెట్టి వస్తున్నారు. తమ తమ జిల్లాలలో అధికారుల బదలీల వంటి చర్యల ద్వారా ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కొంతమంది మంత్రులైతే వైఎస్.జగన్ ఇంటివైపు వెళ్లడమే మానుకొన్నారు. అక్కడకు వెళ్తే ముఖ్యమంత్రికి కోపం వస్తుందన్న సందేహమే అందుకు కారణం. మొత్తానికి నెల్లూరు మేయర్ పేరు రాష్ట్ర కాంగ్రెస్ నేతల నోళ్లలో నానుతున్నాదిప్పుడు.

# పార్టీ ప్రాతిపదికన మునిసిపల్ ఎన్నికలొద్దు!

**● సిఎంతో ఎమ్మెల్యేల నివేదన**

ఆరునెలలలో జరగనున్న మునిసిపల్ ఎన్నికలలో పార్టీ ప్రాతిపదికన పోటీ చేసి, గెలుచుకొని రావడం తమ తరం కాదని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ముఖ్యమంత్రి రోశయ్య గారికి నివేదిస్తున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరిపే సాంప్రదాయానికి తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుట్టింది. 1981లో అంజయ్య ముఖ్యమంత్రిగా వున్నప్పుడు టిక్కెట్ లేకుండా ఎన్నికలు జరిపారు. కానీ ఆ తర్వాత ఎన్టీరామారావు అధికారంలోకి రాగానే 1987లో జరిపిన ఎన్నికలకు పార్టీ టిక్కెట్లు ఇచ్చారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు కూడా అదే సాంప్రదాయం పాటించాడు. 1999 తర్వాత రాష్ట్రంలో తన పరిస్థితి బాగాలేదని తెలిసినా, టిఆర్ఎస్ పుట్టుకతో తెలంగాణలో ఎదురు దెబ్బ తప్పదని తెలిసినా చంద్రబాబు వెనక్కు తగ్గలేదు. 2004లో అపూర్వమైన ప్రజా మద్దతుతో అధికారంలోకి వచ్చిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పార్టీ ప్రాతిపదికతో ఎన్నికలు జరపడానికి ఎంతమాత్రం వెనక్కు చూడవలసిన అగత్యం ఏర్పడలేదు.

కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. వైఎస్ బ్రతికి లేడు. తదనంతర పరిణామాలలో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా నీరసించి పోయింది. రాష్ట్రం మొత్తం మీద పార్టీని నడిపించే నాయకుడు లేకుండా పోయాడు. జిల్లాలకు వెళ్లి ప్రచారం చేసే స్థాయిలో ఒక్క రాష్ట్రనేత కూడా లేడు. మరొకప్రక్క నిధుల సమస్య వుంది. వైఎస్ వున్నంత కాలం ఎన్నికలంటే ఎమ్మెల్యేలకు మంచినీళ్ల మర్యాదగా వుండేది. ఎవరికి ఎంత అవసరమో అంత సొమ్ము అడగకుండానే ఇంటికి చేర్పించేవాడు వైఎస్. దానితో ఎమ్మెల్యేలు తమ శక్తి యుక్తులన్నీ ఎన్నికల మీద కేంద్రీకరించేవారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు చిల్లి గవ్వ విదిల్చేవాడు కనిపించడం లేదు. స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి నిధులు రావు. రాష్ట్రంలో రోశయ్య అంత భారం పెట్టుకోడు.

మరొకప్రక్క గత ఏడాదిగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో పడిపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయి. అమలులో వున్న జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు సైతం మూలపడ్డాయి. అటు జనాన్ని కానీ, ఇటు కార్యకర్తలను కానీ సంతోష పెట్టే పరిస్థితిలో ఒక్క ఎమ్మెల్యే

కొరవ 14వ పేజీలో




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరువక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.